
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

1



శ్రీ పొట్టి శ్రీరాములు


నెల్లూరు

జిల్లా వార్తలు

బుధవారం 14 ఫిబ్రవరి 2024

ప్రేమకు వేళాయె!

ప్రేమికులు ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. తమ మనసులో మాట చెప్పేందుకు ప్రేమికులు ఎదురు చూస్తున్నారు. ప్రేమను వ్యక్తం చేసేవారు. ప్రేమలో ఉన్నవారు ఈ రోజు ఎప్పటికీ గుర్తుండిపోయేలా ప్లాన్ చేసుకుంటున్నారు. రోజా పువ్విచ్చి ప్రియురాలిని మురిపించే కాలం ఎప్పుడో చెల్లిపోయింది. ఒక్క నవ్వుతో ప్రియుడిని గాలిలో తేలిపోయేలా చేసే పవర్ తప్పిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రేమికులు ఒకరికొకరు ప్రత్యేకంగా కనిపించేందుకు విభిన్నంగా ఆలోచిస్తున్నారు. అయితే ఈ విషయంలో విచ్చలవిడితనం కనిపిస్తే దాడులు తప్పవంటున్నారు కొందరు వ్యతిరేకవాదులు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం..



● నేడు ప్రేమికుల దినోత్సవం

ప్రేమికులు ఖరీదైన కానుకలతో సర్‌ప్రైజ్ చేసుకునేందుకు సన్నద్ధమయ్యారు. మదిలో ఉన్న ప్రేమ సందేశాలను ఇచ్చి పుచ్చుకునేందుకు మార్కెట్లో ఎన్నో వస్తువులు అందుబాటులోకి వచ్చేశాయి. స్టేషనరీ దుకాణాలు యువతీ, యువకులతో కళకళలాడుతున్నాయి. తమ ప్రేమ చిరకాలం ఉండాలన్నా, తీపి గుర్తుగా మిగిలిపోవాలన్నా, మధుర జ్ఞాపకాలను ఫ్రేమ్‌లో బంధించాలన్నా ఎన్నో గిఫ్టులు అందుబాటులో ఉన్నాయంటున్నారు ప్రేమికులు. అలాగే ప్రేమికుల కోసం ఎన్నో రకాల విదేశీ చాక్లెట్లు నోరూరిస్తున్నాయి. హార్ట్ షేప్‌లో ఉండే ఈ తీపిగుర్తులు ప్రత్యేక ప్యాక్‌లతో సిద్ధంగా ఉన్నాయి. గతంలో కంటే ఈసారి వాలెంటైన్స్ డేకి ప్రత్యేక గిఫ్టులు అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

● ఆన్‌లైన్‌లో ప్రేమజోరు..

పెరిగిన టెక్నాలజీకి అనుగుణంగా ఆన్‌లైన్‌లో కూడా ప్రేమ జోరందుకుంది. ప్రేమికుల రోజు సందర్భంగా ఆన్‌లైన్ షాపింగ్ సంస్థలు కూడా హంగామా సృష్టిస్తున్నాయి. ప్రత్యేక బొకేలతోపాటు చాక్లెట్స్, కేక్స్, విభిన్నమైన బహుమతులను రకరకాల ఆఫర్లతో అందుబాటులో ఉంచుతున్నాయి. అలాగే సోషల్ నెట్‌వర్క్‌లలో కూడా ప్రేమ సందేశాలు పంపించుకునేందుకు యువత సిద్ధమైంది. ప్రేమికుల కోసం పలు రెస్టారెంట్‌లు, హోటళ్లు కూడా బుధవారం ప్రత్యేక ఆఫర్లను ప్రకటించాయి. ఇదిలా ఉంటే ప్రేమికుల రోజును బహిష్కరిస్తామని, విచ్చలవిడిగా కనిపిస్తే ప్రేమికులను అడ్డుకుంటామని కొంతమంది వ్యతిరేకవాదులు హెచ్చరిస్తున్నారు.



- నెల్లూరు (విద్య)

జడ్పీ బడ్జెట్

రూ.374 కోట్లు

● రూ.297 కోట్ల ఖర్చుతో రూపకల్పన ● సభ్యుల ఏకగ్రీవ ఆమోదం

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 13 : జిల్లా పరిషత్ 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను జడ్పీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. బడ్జెట్ అంచనాలకు సంబంధించి నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన మంగళవారం అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బడ్జెట్‌పై జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో చిరంజీవులు సభ్యులకు వివరించారు. 2022-23 ఏడాది ఆదాయం రూ.157.89 కోట్లు రాగా రూ.161.05 కోట్లు ఖర్చయినట్లు చూపారు. 2023-24 బడ్జెట్ అంచనాలు రూ.366.89 కోట్లు కాగా ఖర్చు రూ.326.37 కోట్లు అయ్యిందని చూపారు. 2023-24 సవరణ అంచనాలు రూ.348.20 కోట్లు కాగా ఖర్చు రూ.281.26 కోట్లు అయినట్లు చూపారు. 2024-25 బడ్జెట్ అంచనాలు రూ.374.43 కోట్లు అని, రూ.297.42 కోట్లు ఖర్చవుతుందని, రూ.77 కోట్లు మిగులు ఉంటుందని అంచనాలు రూపొందించగా దీనికి సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

● ఆ బిల్లులు ఇప్పించడమ్మా...!

'రాష్ట్ర ప్రభుత్వ ఐదేళ్ల పాలన త్వరలో ముగుస్తుంది. ఈ నెల లేదా వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుంది. ఇప్పటికైనా చేసిన పనులకు బకాయిలు ఇప్పించడమ్మా.. మా పరువు కాపాడండమ్మా!' అంటూ పలువురు జడ్పీటీసీ సభ్యులు జడ్పీ చైర్‌పర్సన్‌కు మొరపెట్టుకున్నారు. సమావేశం అనంతరం మర్రిపాడు, కావలి జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, రాఘవులు మాట్లాడుతూ సచివాలయాలు, నాడు-నేడు పనులు తదితర భవనాల నిర్మాణాలకు కాంట్రాక్టర్లు ఎవరూ రాలేదనానరు. దీంతో కార్యకర్తలను బతిమలాడి ఎమ్మెల్యేలు, మీపై ఉన్న నమ్మకంతో పనులు చేయించి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు బిల్లులు మంజూరు చేయలేదని, దీంతో కార్యకర్తలు అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రేపో, మాపో ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్నందున ఇప్పటికైనా బిల్లులు ఇప్పించాలని కోరారు. నాడు-నేడు పనుల కింద దాదాపు రూ.7 కోట్ల బకాయిలు ఉన్నాయని, సచివాలయాలు, ఇతర భవనాలకు సంబంధించిన పనులు పూర్తయినా ఇంతవరకు ఎంబుక్‌లు సిద్ధం చేయలేదని, వాటన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. ఇసుక రవాణాకు సంబంధించి జరిమానాలు భారీగా విధిస్తున్నా జడ్పీకి రూపాయి కూడా మైనింగ్ శాఖ ఇవ్వడం లేదని, వాటిని రాబట్టాలని కోరారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి బిల్లులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నందున నిధులు అధికంగా కేటాయించాలని కోరారు.



జడ్పీ సమావేశ మందిరంలో ఖాళీగా ఉన్న కుర్చీలు



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

● ఎంపీలు, ఎమ్మెల్యేల డుమ్మా

ఈ బడ్జెట్ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు గైర్హాజరు అయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇద్దరు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బీద మస్తాన్‌రావు, ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, గురుమూర్తితోపాటు రాష్ట్ర మంత్రి సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వరప్రసాద్, సంజీవయ్య, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు గైర్హాజరయ్యారు. సార్వత్రిక హడావుడి మొదలుకావడంతో ప్రచారాలపై దృష్టి సారించిన నేతలు జడ్పీ సమావేశంపై ఆసక్తి చూపలేదు. జిల్లాలోనే మంత్రి కాకాణితోపాటు ఎక్కువమంది ఎమ్మెల్యేలు ఉన్నా ఈ సమావేశానికి డుమ్మాకొట్టడం చర్చనీయాంశమైంది.

కావలి నుంచే పోటీ చేస్తా!

- నేటి మధ్యాహ్నం బహిరంగ సభ
- పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సుధాకర్

కావలి (టౌన్): పార్టీ ఏదైనా తాను కావలి అసెంబ్లీ స్థానం నుంచే తాను పోటీ చేస్తానని పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ స్పష్టం చేసారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కావలిలోని మినీ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం కావలిలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తాను ఏదైనా పార్టీ నుంచి పోటీ చేస్తానా లేదా స్వతంత్రంగా పోటీ చేస్తానా అనే ఊహాగానాలకు ఈ సభలో స్పష్టత ఇస్తానని పేర్కొన్నారు. ప్రజలు గెలిపిస్తారన్న నమ్మకంతోనే పోటీ చేస్తున్నానని, పార్టీ టికెట్లపై బరిలో నిలిచే వారంతా గెలవరని గెలిచేది ఒక్కరే అని, ఆ ఒక్కరు తానెందుకు కాకూదన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. కాగా, కావలిలో జరుగుతున్న సభ ఏర్పాట్లను సుధాకర్ పరిశీలించారు.

నేటి నుంచి ఉద్యోగుల ఉద్యమబాట

● 27న చలో విజయవాడ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 13 : తమ డిమాండ్ల సాధన కోసం బుధవారం నుంచి ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమబాట పడుతున్నారు. ఉద్యోగ సంఘ నాయకులతో సోమవారం ప్రభుత్వ పెద్దలు జరిపిన చర్చలు ఫలించలేదు. దీంతో ఏపీజేఏసీ నాయకులు ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. తమ సత్తా ఏమిటో ఈ ఉద్యమం ద్వారా నిరూపిస్తామని నేతలు తేల్చి చెబుతున్నారు. బుధవారం ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారు. తహసీల్దారు, సబ్ కలెక్టర్, కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందచేస్తారు. 15, 16 తేదలలో నల్లబ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన విరామ సమయంలో తాలూకా కేంద్రాలు, పాఠశాలల్లో నిరసన పాటిస్తారు. 17న తాలూకా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు, 20న జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకుంటే 27న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు ఏపీజేఏసీ రాష్ట్ర నాయకులు అన్నీ జిల్లాలో పర్యటించి చలో విజయవాడ విజయవంతానికి ఉద్యోగులను సన్నద్ధం చేయనున్నారు.

● ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనాలి

డిమాండ్ల సాధన కోసం బుధవారం నుంచి ఉద్యోగులు ఉద్యమబాట పడుతున్నారని ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ మన్నేపల్లి పెంచలరావు చెప్పారు. మంగళవారం ఎన్జీఓ హోంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీజేఏసీ ఆధ్వర్యంలో జరుగు తున్న ఈ ఉద్యమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీగా పాల్గొనా లని పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో జేఏసీ కన్వీనర్ నాయు డు వెంకటస్వామి, ఆర్టీసీ ఎన్ఎం యూ నాయకుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పెంచలరావు

మెయిన్స్‌లో మెరుపులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 13 : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వ హించే జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వతేదీ వరకు రెండు విడతలుగా జరిగిన ఈ పరీక్షలకు జిల్లాలో 16వేల మందికి పైగా విద్యార్థులు హాజర య్యారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయగా, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి త్వశాఖ ఆధ్వ ర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ఈ పరీక్ష లను నిర్వహించారు. మంగళవారం విడు దలైన ఫలితాల్లో జిల్లా విద్యార్థులు పలు విభాగాల్లో ర్యాంకులను సొంతం చేసుకున్నారు. నారాయణ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థి షేక్ సూరజ్ 100 పర్సంటైల్‌తో జిల్లాలోనే అగ్ర స్థానంలో నిలవగా, కృష్ణచైతన్య కళా శాలకు చెందిన జే హర్ష వర్ధన్ 99.82 పర్సంటైల్, ఓవెల్ విద్యా సంస్థలకు చెందిన ఎస్‌వీ సంతోష్‌కుమార్ యాదవ్ 99.838, శ్రీచైతన్య కళాశాలకు చెందిన డీ ధనుశ్రీ 97.08 పర్సం టైల్, విశ్వ సాయి విద్యాసంస్థలకు చెం దిన ఎం దివ్యశ్రీ 97.82. సీహెచ్ యశ్వంత్ 97.52 పర్సంటైల్‌ను సాధించారు.

జేఈఈ ఫలితాల విడుదల
ర్యాంకులు సాధించిన జిల్లా విద్యార్థులు



ఐఐటీలో సీటు సాధిస్తా

చదువుపై ఉన్న మక్కువతో విద్యలో రాణిస్తు న్నాను. నగరంలోని ధనలక్ష్మిపురంలో నివాసం ఉంటున్నాము. తల్లిదండ్రులు మల్లీశ్వరి, ధరియా సాహెబ్ ప్రోత్సాహం, నారాయణ విద్యా సంస్థలో అత్యుత్తమ విద్యా బోధనతో మెయిన్స్‌లో 100 పర్సంటైల్ సొంతం చేసుకున్నాను. ఇదే స్ఫూర్తితో రానున్న మెయిన్స్-1 అడ్వాన్స్‌డ్‌లో కూడా అత్యు త్తమ ర్యాంకు సొంతం చేసుకుని భవిష్యత్‌లో ఐఐటీలో సీటు సాధించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నాను.

- షేక్.సూరజ్, 100 పర్సంటైల్



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణిస్తా

కావలికి చెందిన తాను చిన్నతనం నుంచి తల్లిదండ్రులు వెంకారెడ్డి, అపర్ణ అందించిన ప్రోత్సాహంతో విద్యలో ఉత్తమంగా రాణిస్తున్నాను. ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన నేను జేఈఈపై దృష్టి సారించాను. జేఈఈ మెయిన్స్‌లో 99.92 పర్సంటైల్‌ను సాధించిన నేను రానున్న అడ్వాన్స్‌డ్‌లో కూడా ఉత్తమ ర్యాంకు సాధించేందుకు కృషి చేస్తాను. అధ్యాపకుల కృషి, తల్లిండ్రుల ప్రోత్సాహంతో మున్ముందు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణించేలా విద్యనభ్యసిస్తాను.

- జీ రితేష్ రెడ్డి, 99.92 పర్సంటైల్




ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి

సైన్స్ పరిశోధనలు విస్తృతంగా జరగాలి

● వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి

నెల్లూరు (విద్య) : మానవాళికి ఉపయోగ పడేలా సైన్స్ పరిశోధనలు విస్తృతంగా జరగాలని, దీనికి పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పునాదులు వేసి వారిని ఉత్తమ వైజ్ఞానికులుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన (ఇన్‌స్పైర్ మనక్)ను మంత్రి కాకాణి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ పి.స్రవంతిలు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయన్నారు. సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేలా విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇతర దేశాల కంటే భారత్ ఏమాత్రం తీసిపోకుండా అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నామన్నారు. డీఈఓ రామారావు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో సైన్స్ కీలకపాత్ర పోషిస్తుందన్న విషయాన్ని గుర్తించి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఖగోళ దర్పణాన్ని, విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలను మంత్రి సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఇన్‌స్పైర్ మనక్ పర్యవేక్షకులు గుజరాత్‌కు చెందిన నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ మహ్మద్ రయూష్ షేక్, నెల్లూరు, కావలి డిప్యూటీ ఈఓలు ప్రసన్నలక్ష్మి, రఘురామయ్య, నెల్లూరు ఎంఈఓలు మురళీధర్, బిక్షాలు, అబ్దుల్ హమీద్, ఉత్తమ ఉపాధ్యాయులు నెల్లూరు ఫణికుమార్, పాఠశాల హెచ్ఎం కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విజేతలతో అధికారులు

రాష్ట్ర పోటీలకు 13 ప్రాజెక్టులు

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో 13 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. కాగా ఓవెల్ పాఠశాలకు చెందిన కె.ఆమోగ్ వర్ష (మల్టీఫంక్షనల్ రోడ్ రిపేరింగ్ రోబోట్) ప్రథమ, సౌత్‌మోపూరు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన టి.ప్రణీక(మూవబుల్ అండ్ అడ్జెస్టబుల్ వాటర్‌టాప్) ద్వితీయ, ఈదూరు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన డి.వెంకట. దరణ్ (ఫార్మర్స్ లైఫ్ సేవింగ్ స్టిక్) తృతీయ స్థానాలు సాధించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు డీఈవో రామారావు, ఇతర అధికారులు బహుమతులు అందజేశారు.

ఆలోచించారు..
ఆవిష్కరించారు!

ఆటోమేటిక్ ఇరిగేషన్.. ఫార్మర్ లైఫ్ సేవింగ్ స్టిక్స్.. అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ ఫాల్ట్.. జంక్ ఫుడ్ ప్రాబ్లమ్స్ ... స్మార్ట్ డస్ట్‌బిన్ ఫర్ స్టార్ట్ సిటీస్.. ఇంటెలిజెంట్ హెల్మెట్.. ఇలా బాలశాస్త్రవేత్తలు రూపొందించిన ఎగ్జిబిట్స్ పెద్దలను సైతం ఆలోచింపజేశాయి. విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలంటే శాస్త్రీయ ఆలోచనలకు పదును పెట్టాలి. ఆ దిశగా వారిని ప్రోత్సహించేందుకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో వివిధ పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన 154 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శనకు ఉంచారు. ఈ పోటీల్లో విద్యార్థులకు ఒకరినొకరు పోటీపడుతూ ఎగ్జిబిట్‌లను ప్రదర్శనలో ఉంచి వాటి అవసరాలు, ఉపయోగాలను తెలియచేశారు. పలువురు ప్రముఖులు, అధికారులతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తరలివచ్చి ప్రదర్శనను తిలకించారు.

- నెల్లూరు (విద్య)

పంటలకు సకాలంలో నీటి సరఫరా

- విద్యార్థి : ఆర్.గీతాలక్ష్మి (10వతరగతి)
- గైడ్ టీచర్ : పి.వెంకటరమణమ్మ
- పాఠశాల : ఏపీటీడబ్ల్యుఆర్‌జి స్కూల్(రాపూరు)



ఆటోమేటిక్ ఇరిగేషన్ సాయిల్ మాయిశ్చర్ కంటెంట్ కంట్రోల్ ప్రాజెక్ట్ వ్యవసాయ భూముల్లో నీటి సాంద్రత తగ్గిన సమయంలో పంటకు సరైన సమయంలో నీటిని అందించేందుకు ఈ ప్రాజెక్ట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. భూమి సాంద్రతను బట్టి నీరు ఎంత అవసరం, ఏ సమయంలో అందించాలన్న విషయాలను సెన్సార్ ద్వారా తెలియచేస్తుంది. ఇది రైతులకు ఎంతో ఉపయుక్తమైన ప్రాజెక్ట్. అతితక్కువ ఖర్చుతో దీన్ని సిద్ధం చేసుకుంటే నీటి సమస్యను కొంత వరకు తగ్గించుకోవచ్చు.



రైతుల ప్రాణాలకు రక్షణ

- విద్యార్థులు : జలీల్, శ్రీతేజ (10వ తరగతి)
- గైడ్ టీచర్ : ఎన్‌పీసీ ఉదయ్‌భాస్కర్
- పాఠశాల : జడ్పీహెచ్ఎస్, ఈదూరు, టీపీగూడూరు

రైతులు పొలాల్లో తిరిగే సమయంలో పాముకాటుకు గురై మృతి చెందిన సందర్భాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారు. ప్రమాదాల నుంచి రైతులు తమను తాము కాపాడుకునేందుకు ఈ స్టిక్ ఉపయోగపడుతుంది. ఈ సేవింగ్ స్టిక్స్‌లో వైబ్రేషన్ వచ్చి అవి పాములను దూరంగా వెళ్లిపోయాలా చేస్తాయి. దీనికి టార్చ్‌లైటు కూడా ఉండటం వల్ల చీకట్లో కూడా రైతులు ధైర్యంగా పొలంలోకి వెళ్లి పనులు చేసుకోవచ్చు.

సకాలంలో చెత్తను తొలగించడం

- విద్యార్థి : బి.మనోజ్ (7వతరగతి)
- గైడ్ టీచర్ : రత్నారెడ్డి
- పాఠశాల : జడ్పీహెచ్ఎస్, అనంతసాగరం

స్మార్ట్ డస్ట్‌బిన్ ఫర్ స్మార్ట్ సిటీస్ ప్రాజెక్ట్‌తో చెత్తను సకాలంలో తొలగించవచ్చు. అన్ని కాలనీల్లో చెత్త కుండీలు, చెత్త డంపింగ్ ప్రదేశాల్లో దీన్ని ఏర్పాటు చేస్తే చెత్త పూర్తిగా నిండి, అపరిశుభ్రంగా ఉన్న వెంటనే సెన్సార్ ద్వారా సంబం ధిత మునిసిపల్ అధికారుల మొబైల్‌కు సమాచారం అందజేస్తుంది. వెంటనే సంబం ధిత సిబ్బంది ఏ ప్రాంతంలో చెత్త పేరుకుపోయిందో ఆ ప్రాంతానికి చేరుకుని వెంటనే శుభ్రం చేసేలా దీన్ని రూపొందించారు.





భూగర్భ విద్యుత్ పునరుద్ధరణ

- విద్యార్థి : లక్ష్మీసోనియా (10వతరగతి)
- గైడ్ టీచర్ : మల్లిఖార్జునరావు
- పాఠశాల : వాత్సల్య, నెల్లూరు

అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ ఫాల్ట్ ద్వారా భూగర్భం నుంచి సరఫరా అయ్యే విద్యుత్ సమస్యలను కనుగొని పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్ట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అండర్ గ్రౌండ్‌లో వేసే విద్యుత్ సరఫరా, ఇతర కేబుల్స్ నుంచి వచ్చే విద్యుత్ సరఫరా కొన్ని సందర్భాల్లో ఇబ్బందులు కలిగించిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా సెన్సార్‌ను ఉపయోగించి ఏ ప్రాంతంలో సమస్య ఉందో ముందే పసిగట్టి అలర్ట్ చేస్తుంది. వెంటనే సంబంధిత సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి సమస్యను పరిష్కరించేలా దీన్ని సిద్ధం చేశారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



- విద్యార్థి : కె.పావని (10వతరగతి)
- గైడ్ టీచర్ : ఎం.ఛాయాకుమారి
- పాఠశాల : జడ్పీహెచ్ఎస్ బాలికలు, కావలి

జంక్ ఫుడ్ తినడం వల్ల వచ్చే వ్యాధులు- చిరు ధాన్యాలతోనే ఎముకల ధృడత్వం పేరుతో తయారు చేసినదే ఈ ప్రాజెక్ట్. నేటి ఆధునిక సమాజంలో జంక్ ఫుడ్ తింటూ ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి గురవుతున్నారు. వీటి నుంచి తప్పించుకునేందుకు ఆరోగ్యాన్ని పరిరక్షించు కునేందుకు చిరుధాన్యాలు ఎంతో ఉపయోగపడతాయి. వీటిలో పీచు పదార్థాలు అధికంగా ఉండడంతో మలబద్ధకం, కాల్షియం, ఫాస్పరస్ ఉండడంతో ఎముకల ధృడత్వం కలిగి ఉండటం, రక్తహీనత నుంచి కాపాడడం, గుండె జబ్బుల నుంచి నివారణ పొందవచ్చు.

రైల్వేలో విద్యుత్ ఆదా కోసం..

- విద్యార్థి : ఎం.ప్రతాప్ (10వతరగతి)
- గైడ్ టీచర్ : శ్రీహరి
- పాఠశాల : జడ్పీహెచ్ఎస్-ఇస్కపల్లి, అల్లూరు

ఎనర్జీ సేవింగ్ సిస్టమ్ ఫర్ రైల్వే ప్లాట్‌ఫారం ప్రాజెక్ట్ ద్వారా ఇంధనం, విద్యుత్‌ను ఆదా చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. రైలు ప్లాట్‌ఫారం మీదకు వచ్చే సమయం, వెళ్లే సమయంలో మాత్రమే విద్యుత్ వెలిగేలా దీన్ని రూపొందించారు. దీనివల్ల ఇంధన వినియోగంతోపాటు విద్యుత్ కూడా ఆదా అవుతుంది. రైలు మొదటి కోచ్ నుంచి చివరి కోచ్ వరకు ఈ పద్ధతి ద్వారా విద్యుత్‌ను అందిం చేలా సెన్సార్‌లు పనిచేస్తాయి. అవసరం లేని సమయంలో లైట్లన్నీ ఆరిపోయేలా దీన్ని సిద్ధం చేశారు.



ఈ హెల్మెట్ పెట్టుకుంటేనే రైడ్!

- విద్యార్థులు : కె.మల్లిక, ఎం.సిరి (10వతరగతి)
- గైడ్ టీచర్ : యూ.సుధాకర్‌రావు
- పాఠశాల : జడ్పీహెచ్ఎస్, చిన్నచెరుకూరు, టీపీ గూడూరు



ఇంటెలిజెంట్ హెల్మెట్ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పనిచేస్తుంది. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదంలో అనేకమంది మృతి చెందుతున్నారు. వీరిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్ట్‌ను తయారైంది. హెల్మెట్ ధరిస్తేనే వాహనం స్టార్ట్ అయ్యేలా లేనిపక్షంలో అలర్ట్ మెసేజ్ వస్తుంది. దీనివల్ల ఖచ్చితంగా వాహనాదారులు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడుపుతారు. ప్రమాదాలను కూడా నివారించవచ్చు.

జేఈఈలో 'నారాయణ' ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శరణి, అధ్యాపకులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 13 : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ ఐఐటీ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి నారాయణ తెలిపారు. మంగళవారం నగరంలోని కళాశాలలో జరిగిన అభినం దన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తమ సంస్థకు చెందిన షేక్ సూరజ్ 100 పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలిచాడన్నారు. బీ రితేష్‌రెడ్డి 99.922, ఏ శ్రీనికేష్ 99.917, జే చరిత సాయి సుష్మ 99.900, ఎం లావణ్య చంద్రిక 99.831, పీ అభితేష్ 99.776, పీ సాయినితీష్ 99.771, వీఆర్ దినేష్ కార్తీక్ 99.741, ఎం శ్రీరామ్ సుహాన్ 99.727, ఏ విరించి 99.711 పర్సంటైల్ సాధించారన్నారు. వీరితో పాటు 31 మంది 99 పర్సంటైల్‌కుపైగా, 57 మంది 98 పర్సంటైల్‌కు పైగా, 80 మంది 97 పర్సంటైల్‌కుపైగా, 126 మంది 95 పర్సంటైల్‌కుపైగా, 225 మంది 90 పర్సంటైల్‌కుపైగా సాధించారన్నారు. పటిష్టమైన మైక్రో షెడ్యూల్, బోధనా పద్ధతులు, పరీక్ష విధానాలతోనే ఈ ఫలితాలు సాధించామని చెప్పారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వీ విజయభాస్కర్‌రెడ్డి, డీన్లు, ఏజీఎంలు, ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'విశ్వసాయి' విజయం


దివ్యశ్రీ


యశ్వంత్

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 13 : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశ్వసాయి కళాశాల విద్యార్థులు విజయం సాధించారని కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం నగరంలోని కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన ఎం దివ్యశ్రీ 97.82. సీహెచ్ యశ్వంత్ 97.52 పర్సంటైల్ సాధించారని చెప్పారు. 14 మంది విద్యార్థులు 90కుపైగా పర్సంటైల్, 47 మంది 80కుపైగా పర్సంటైల్ సాధించారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు

'కృష్ణచైతన్య' హవా

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 13 : జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో కృష్ణచైతన్య కళాశాల ఐన్‌స్టీన్ క్యాంపస్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ పర్సంటైల్స్‌తో హవా సృష్టించారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి మాట్లాడారు. తమ విద్యార్థులు జే హర్షవర్ధన్ 99.82 పర్సంటైల్‌తో ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. జీ ప్రతాప్‌నాయుడు 99.42, కే సూర్యప్రకాష్ 97.41, కే విక్రమ్ 97.27, ఏ దివ్యశ్రీ 97.18, కే జ్యోతిర్మయి 97.06 పర్సంటైల్ సాధించారని చెప్పారు. ఒకే క్యాంపస్ నుంచి 95 పర్సంటైల్‌పైన 11 మంది, 90 పర్సంటైల్ పైన 21 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఇదే స్ఫూర్తితో ఎలైట్ ప్రోగ్రామ్ ద్వారా మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల డీన్ శిరీష్‌బాబు, అకడమిక్ డీన్ రామ్‌గోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ రమేష్, ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఓవెల్'కు ఉత్తమ ఫలితాలు


విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్ వేణు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 13 : జేఈఈ మెయిన్స్‌లో ఓవెల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న కళాశాల ప్రాంగణంలో మంగళవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ ఆర్ వేణు మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎస్పీ సంతోష్‌కుమార్ యాదవ్ 99.838, ఏవీ నిఖిత్‌బాబు 99.746, ఆర్ రాకేష్‌కుమార్ 99.465, కే అర్పితా సాజిత్ 99.436, పీ గీతేశ్వర్ 98.937, పీ అఖిల్ 98.54, సీహెచ్ వీరసాత్విక్ 98.43, ఎస్‌కే రహీన్ 98.01 పర్సంటైల్స్ సాధించారని చెప్పారు. మొత్తం మీద 18 మంది 91కిపైగా పర్సంటైల్ సాధించారని, 50 మందికిపైగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. ముమ్ముందు మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో ప్రమీల, ఈడీ బాలు, డీజీఎం వాహెబ్, ఏజీఎం గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, టీమ్ లీడర్లు సుధీర్, పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' విజయభేరి

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 13 : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు విజయ భేరి మోగించారు. కళాశాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో డీన్ జీ శ్రీరామ్ మాట్లాడుతూ తమ విద్యార్థులైన డీ ధనుశ్రీ 97.08, కే లేఖన 96.55, బీ భానుతేజ 96.20, డీ యజ్ఞశ్రీ 95.48, ఎస్‌కే తన్వీర్ సిద్ధిక్ 94.08, బీ భవానీ 94.08 పర్సంటైల్స్‌ను సాధించారన్నారు. మొత్తం 22 మంది విద్యార్థులు 90 పర్సంటైల్‌కుపైగా, 31 మంది విద్యార్థులు 85 పర్సంటైల్‌కుపైగా, 42 మంది విద్యార్థులు 80 పర్సంటైల్‌కుపైగా సాధించారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 8,562 మంది హాజరు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 13 : ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరుగుతున్న ప్రయోగ పరీక్షల(ప్రాక్టికల్)కు మంగళవారం జిల్లా వ్యాప్తంగా 8,562 మంది హాజరయ్యారు. 96 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం సెషన్‌లో 4,328 మంది హాజరు కావాల్సి ఉండగా 4,204 మంది హాజరయ్యారు. 124 మంది గైర్హాజరయ్యారు. మధ్నాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు 4,131 మందికిగాను 4,058 మంది హాజరుకాగా 73 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 8,459 మంది హాజరుకావాల్సి ఉండగా 197 మంది గైర్హాజరయ్యారు. పలు కేంద్రాలను పరీక్షల నిర్వహణ కన్వీనర్, ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు, డీఈసీ సభ్యులు పరిశీలించారు.

జనారణ్యంలోకి వచ్చిన జింక మృతి

కలిగిరి, ఫిబ్రవరి 13: మండలంలోని కావలిముస్తాపురం గ్రామ శివార్లలో జనారణ్యంలోకి వచ్చిన జింక మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. గ్రామ సర్పంచు పోలవరపు సుబ్బానాయుడు కథనం మేరకు.. గ్రామం శివారులోని బ్యారన్ వద్ద మంగళవారం ఉదయం జింక మృతి చెందడాన్ని గ్రామస్థులు గమనించారు. సమాచారం అందుకున్న పశువైద్యశాల కలిగిరి మండల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సురేష్, సిద్ధనకొండూరు వెటర్నరీ వైద్యాధికారి వీరహరిన్‌తో కలిసి జింక కళేబరాన్ని పరిశీలించారు. స్నేక్ బైట్, లేదా విద్యుత్ షాక్ గురై జింక మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.


జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న సర్పంచు, వైద్యాధికారులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	143
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	252
స్కిన్‌లెస్	280
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5947
వెండి కిలో ధర	రూ. 73,200
వెండి ఒక గ్రాము	రూ. 75.20

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 13 : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే పీసీపీఎన్‌డీటీ ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య హెచ్చరించారు. మంగళవారం డీఎంహెచ్‌వో ఛాంబర్‌లో లింగనిర్ధారణ కమిటీతో సమీక్షించారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. స్కానింగ్ కేంద్రాలపై నిఘా పెట్టాలని సూచించారు. ఆడపిల్లల పుట్టకను ప్రోత్సహించాలన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వలంటీర్లు, ఆశాలు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఇందర, కిరణ్, సుల్తానా, రవీంద్ర, లీగల్ కన్సల్టెంట్ రూప, ఎన్‌జీవో కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు టికెట్లు ఇచ్చిన వారికే మద్దతు

● రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల తీర్మానం


సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 13 : బీసీలకు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని బీసీ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓట్టూరు సంపత్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో బీసీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బీసీ నాయకులు, బీసీ సంఘాల నేతలు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తొలుత వైసీపీ నుంచి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీల అభివృద్ధి కోసం అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రస్తావించారు. ఇందుకు స్పందించిన టీడీపీ నేతలు చెంచలబాబు యాదవ్, కప్పిర శ్రీనివాసులు, బొమ్మి సురేంద్ర మాట్లాడుతూ బీసీల రాజకీయ అభివృద్ధికి టీడీపీ చేసిన కృషిని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ కంటే ఒకటి రెండు స్థానాలు అదనంగానే బీసీలకు తమ పార్టీ ఇస్తుందని స్పష్టం చేశారు. ఇలా ఇరుపార్టీల నేతల మాటలతో కొంతసేపు గందరగోళం ఏర్పడింది. ఈ సందర్భంగా సంపత్ రాజు యాదవ్ వారిని శాంతపరుస్తూ రాజకీయ పార్టీలన్నీ బీసీలకు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నేత రామరాజు (సీపీఐ), నాగేంద్ర, మొగరాల సురేష్, పీఎల్‌రావు (బీజేపీ), ఎస్ఎస్ యాదవ్ (బీసీవైపీ), కనకట్ల రఘురాం ముదిరాజ్ (కాంగ్రెస్), ఓత్తూరు సుధాకర్ (వైసీపీ), బీసీ నేతలు కేవీ శేషయ్య దేవరాల సుబ్రహ్మణ్యం, జనార్ధన్, బొమ్మి నాగకిషోర్, జానకిరామ్ యాదవ్ (బీఎస్పీ), దినేష్ (సమాజ్‌వాదీ పార్టీ), సురేష్, బాలాజీ (పద్మశాలి సంఘం), బెల్లంకొండ చిన్నయ్య, బెల్లంకొండ శ్రీనివాసులు (వడ్డెర సంఘం), కిన్నెర మాలకొండయ్య, శ్రీకుమార్ (నాయీబ్రాహ్మణ సంఘం) తదితర సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

టిడ్కోపై 'ఎన్నికల ప్రేమ

- పేదోడి కలను ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ సర్కారు
- ఎన్నికలు రాబోతుండటంతో హడావిడిగా నేడు పంపిణీ
- మౌలిక సదుపాయాలు లేకనే లబ్ధిదారులకు అందచేత
- హాజరుకానున్న మున్సిపల్ మంత్రి సురేష్

టీడీపీ ప్రభుత్వంలో పురుడు పోసుకుని దాదాపుగా నిర్మాణం పూర్తి చేసుకున్న అపార్ట్‌మెంట్ తరహా టిడ్కో ఇళ్లు సుమారు ఐదేళ్ల తర్వాత నేడు లబ్ధిదారులకు అందనున్నాయి. అధికారం చేపట్టాక ఆ ఇళ్ల విషయం విస్మరించిన వైసీపీ ప్రభుత్వం, త్వర లో ఎన్నికలు రానుండటంతో హడావిడిగా పంపిణీకి రంగం సిద్ధం చేసింది. అన్ని వసతులు కల్పించకుండానే దరఖాస్తుదారులకు అప్పగించేస్తోంది. బుధవారం జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరు కానున్నారు.

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 13 : టిడ్కో ఇళ్లు అందజేసి సొంతింటి కల నెరవేర్చాలంటూ ఐదేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ఆశావహులకు ఉన్నట్టుండి ఇళ్లు ఇస్తున్నామంటూ యంత్రాంగం కబురుపెట్టింది. వారికి కేటాయించిన ఇళ్ల తాలుకు పత్రాలు తీసుకురావాలని తెలియజేసింది. మరికొన్ని రోజుల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో అరకొరగా సిద్ధమైన ఇళ్లను లబ్ధిదారులకు అంటకట్టేందుకు ఇటు టిడ్కో, అటు కార్పొరేషన్ అధికారులు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమాన్ని జగన్ సర్కారు ఎన్నికల స్టంట్‌గా వాడుకునేందుకు భారీ ఏర్పాట్లు చేసింది.



ప్రజా మద్దతు కోసం...

ఈ నెల 20వ తేదీ పైన ఎన్నికల ప్రకటన విడుదలయ్యే అవకాశం ఉండటంతో ప్రజలను ఆకట్టుకునేందుకు జగన్ ప్రభుత్వం పడరానిపాట్లు పడుతోంది. ప్రజామద్దతు కూడకట్టుకు నేందుకు టీడీపీ హయాంలో దాదాపుగా పూర్తయిన టిడ్కో ఇళ్లను సుమారు ఐదేళ్ల తర్వాత పంపిణీ చేస్తోంది. ఎన్నికల ప్రచార అస్త్రంగా ఉపయోగించుకునేందుకు బుధవారం అల్లీపురం టిడ్కో కంప్లెక్స్ వద్ద భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. లబ్ధిదారులందరిని ఈ కార్యక్రమానికి తీసుకువచ్చే బాధ్యతను ఆయా ప్రాంతాల సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అప్పగించింది.

సౌకర్యాలేవి....?

నెల్లూరులోని అల్లీపురం, వెంకటేశ్వరపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి, కొండ్లపూడి, ఇరగాళమ్మ సంఘం వద్ద టిడ్కో ఇళ్లు నిర్మించారు. వీటిల్లో కొన్ని పూర్తవగా, మరిన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. పూర్తయిన ఇళ్లలో ఫ్యాన్లు, లైట్లు, ఇతర సామగ్రిని తొలుత అధికారులు ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం అవి నిరుపయోగ గంగా మారాయి. కొన్నింటిలో చోరీకి గుర య్యాయి. తాజాగా ఇళ్ల పంపిణీ చేస్తున్న అధికారులు ఆయా సామగ్రిని మళ్లీ ఏర్పాటు చేస్తారా? లేక లబ్ధిదారులే సమకూర్చుకోవాలా? అనే దానిపై స్పష్టత లేదు. టిడ్కో గృహాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయని, గృహ సముదాయాల్లో కనీస వసతులు కూడా లేవని లబ్ధిదారులు వాపోతున్నారు. నగరానికి దూరంగా నిర్మించిన అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి, కొండ్లపూడి ప్రాంతాల్లోని ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది.

15,502 మందికి నేడు పంపిణీ

నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో అధికారులు 27 వేల ఇళ్లను నిర్మిస్తున్నప్ప టికీ బుధవారం 15,502 మందికి మాత్రమే గృహాలు అందచేయనున్నారు. ఇందులో అల్లీపురం వద్ద 7,392 మందికి, అక్కచెరువు పాడు వద్ద 1,920, కల్లూరుపల్లి వద్ద 1,584, కొండ్లపూడి వద్ద 2,206, ఇరగాళమ్మ సంఘం వద్ద 48, వెంకటే శ్వరపురం ఫేజ్-2లో 2,352 మందికి ఇళ్లను అందచేసేందుకు చర్యలు చేపట్టారు. కాగా, సౌకర్యాలు కల్పించకుండా ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులు తిరగబడతారేమోనన్న ఆందోళన కార్పొరేషన్ అధికారుల్లో నెలకొంది.

16న జాబ్‌మేళా

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), ఫిబ్రవరి 13: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 16వ తేది మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యాక్సెంచర్, టెక్ మహీంద్ర, టెలిపర్‌ఫామెన్స్, ఏజీఎస్ హెల్త్‌రైడ్, జియో, ముత్తూట్ ఫైనాన్స్, ఇన్ఫోసోర్స్ కెరీర్ స్కూల్, టైక్ కాస్టింగ్, బ్లూస్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సదర్‌ల్యాండ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులు ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు.

డీసీఎంఎస్ మనుగడకు ప్రభుత్వ పథకాలు అవసరం

● చైర్మన్ వీరి చలపతి ● ప్రణాళిక అభివృద్ధి కమిటీ పరిశీలన


డీసీఎంఎస్ రైస్‌మిల్లు ప్రాంగణంలో చైర్మన్, వ్యాపారాభివృద్ధి ప్రణాళిక కమిటీ సభ్యులు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 13 : జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీల మనుగడకు ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు అమలు అవసరమని ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. మంగళవారం నెల్లూరులోని ఆ సొసైటీ కార్యాలయాన్ని, నవాబు పేట లోని డీసీఎంఎస్ రైస్ మిల్లును వ్యాపారాభివృద్ధి సమగ్ర ప్రణాళిక నిపుణుల కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా వీరి చలపతిరావు విలేకరులతో మాట్లాడుతూ ప్రోత్సా హక స్కీమ్‌లు లేకపోతే డీసీఎంఎస్ మనుగడ కష్టమన్నారు. రూ.7.5కోట్ల విలువైన ధాన్యం సేకరణ ద్వారా డీసీఎంఎస్‌కు లాభాలు చేకూర్చిపెట్టామన్నారు. డీసీఎంఎస్ ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు, హాస్టళ్లకు ఆహార వస్తువులు, స్టేషనరీ, రైతు భరోసా కేంద్రాలకు విత్తనాల సరఫరా, ఆపరాలు, ధాన్యం సేకరణ, పెట్రోలు బంకు నిర్వహణ, గోదాములు, ఇతర నిర్మాణాలకు సంబంధించి తక్షణ అనుమతులు అవసరమన్నారు. ఈ వ్యాపారాలు ప్రభుత్వ పరంగా చేయగలి తే డీసీఎంఎస్ బలోపేత మవుతుందని చెప్పారు. నవాబుపేటలోని రైసు మిల్లు స్థలంలో కల్యాణ మండపంగానీ, షాపింగ్ కాంప్లెక్సుగానీ నిర్మించాలనే తలంపుతో ఉన్నామన్నారు. అక్కడ వ్యాపారాభి వృద్ధికి సమగ్ర ప్రణాళికలు తయారు చేసి ఇవ్వడానికి హైదరాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెం టుకు చెందిన డాక్టర్ శ్యామ్ కుమార్, చెన్నైలోని ఐసీఎంకు చెందిన డాక్టర్ రమణ బృందం వచ్చిందని తెలిపారు. ఈ బృందం రైస్‌మిల్లును పరిశీలించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకట స్వామి, డైరెక్టర్లు కే రంగనాథం, జీ సురేష్‌రెడ్డి, ఖిల్జీ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎల్‌ఎల్‌బీ పరీక్షలు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం, ఫిబ్రవరి 13 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూ ప్రాంగణంలోని వర్సిటీ కళాశాలలో మంగళవారం ఎల్‌ఎల్‌బీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మూడవ సెమిస్టర్ పరీక్షకు 443 మంది, మధ్యాహ్నం ఐదవ సెమిస్టర్ పరీక్షకు 372 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి పరిశీలించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ వర్సిటీలో నూతనంగా నిర్మించిన భవనాల్లో మొదటిసారిగా పరీక్షలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షలను వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్‌బాబు, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ కేవీఎల్ శ్రీకన్యారావు, డాక్టర్ కోట నీలమణికంఠ తదితరులు పర్యవేక్షించారు.

మొగళ్లూరులో అక్రమంగా మైనింగ్

● పరిశీలించిన అటవీశాఖ అధికారులు


మొగళ్లూరులో మైనింగ్ జరిగిన ప్రాంతంలో మ్యాపును పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

పొదలకూరు, ఫిబ్రవరి 13 : మండలంలోని మొగళ్లూరు ఫారెస్ట్ భూమిలో అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్నారని సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో మంగళవారం రాపూరు అటవీశాఖ అధి కారులు అక్రమంగా మైనింగ్ చేస్తున్న స్థలాన్ని పరిశీ లించారు. రాపూరు రేంజర్ రవీంద్రబాబు, దాచూరు డీఆర్‌వో ఖాజారసూల్, రాపూరు స్క్వాడ్ డీఆర్‌వో ప్రసాద్‌రావు, శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి మ్యాప్‌ను పరిశీలించారు. మొగళ్లూరులోని సర్వే నెంబరు 286లో మేజర్ పార్ట్ రిజర్వు ఫారెస్టు ఉందని, కానీ అటవీభూమిలో మైనింగ్ జరగలేదని, దాని సమీపంలో ఉన్న అటవీ పోరం బోకు భూమిలో మైనింగ్ జరిగినట్లు వారు తెలిపారు. అటవీ పోరంబోకు రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిందని వెల్లడించారు. ఈ విషయాన్ని పొదలకూరు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. కాగా రెవెన్యూ, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లు జాయింట్ సర్వే చేసి, మైనింగ్ జరిగిన ప్రదేశం ఎవరి పరిధిలోకి వస్తుందో కచ్చితం గా చెప్పాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన టీడీపీ నాయకులు తల చీరు మస్తాన్‌బాబు, కోడూరు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిలు మాత్రం అక్కడ మైనింగ్ చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని, పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరుతున్నారు. 15 రోజుల నుంచి రూ.కోట్ల విలువయిన సరుకును అమ్మేశారని, ఇప్పు డేమో ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు మాది కాదంటే మాది కాదని స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని, దీనిపై కలెక్టర్ దృష్టి పెట్టి నిజాలు నిగ్గు తేల్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

లైంగిక దాడి కేసులో 13 ఏళ్ల జైలు

నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి 13 : ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో ఉడతా సురేష్ కుమార్ అనే నిందితుడికి 13 ఏళ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. వివాహితుడైన ఉడతా సురేష్ కుమార్ నెల్లూరులోని మూలా పేట నీలగిరి సంఘంలో కాపురం ఉంటూ జిరాక్స్ షాపు నడిపేవాడు. అదే ప్రాంతానికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థిని వెంటపడేవాడు. మార్ఫింగ్ చేసిన ఫొటోలు చూపి అమెను బ్లాక్ మెయిల్ చేసి తను నిర్వహిస్తున్న జిరాక్స్ షాప్‌లో పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె గర్భవతి కావడంతో ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని ఫోన్‌లో బెదిరించాడు. దీంతో సదరు బాలిక 2016 జూలై 3వ తేదీన నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. అదేరోజు 4వ నగర పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణ కాలంలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ శైలజారెడ్డి వాదించారు.

కార్పెంటర్ ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 13: అప్పులు తీర్చలేక ఓ కార్పెంటర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన సయ్యద్ నిషార్ అహ్మద్ (35), యాస్మిన్ దంపతులు రామచంద్రాపురంలోని షాదీమంజిల్ సమీపంలో అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. నిషార్ కార్పెంటర్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అప్పులపాలయ్యారు. సోమవారం భార్య యాస్మిన్ పుట్టింటికి వెళ్ల డంతో నిషార్ ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. నిషార్ తల్లి షాజిదా ఫిర్యాదుతో నవాబుపేట ఎస్‌ఐ రెహమాన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నిషార్ దంపతులకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు.

కూరగాయలకు వెళ్లి ఇద్దరు మహిళల అదృశ్యం


ఎం జయమ్మ (ఫైల్)


జీ రాజేశ్వరి (ఫైల్)

వెంకటాచలం, ఫిబ్రవరి 13 : కూరగాయలకని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన ఇద్దరు మహిళలు అదృశ్యమ య్యారు.ఈ సంఘటన మండలంలోని చెముడుగుంట పంచాయతీ నక్కలకాలనీలో చోటు చేసుకోగా, మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు, చెముడుగుంట పంచాయతీ పవన్‌కాలనీ ప్రాంతానికి చెందిన ఎం జయమ్మ (64), జీ రాజేశ్వరి (61)లు సోమవారం సాయంత్రం బుజబుజనెల్లూరు సమీపంలో జాతీయ రహదారికి అనుకుని ఉన్న కూరగాయల దుకాణానికి వెళ్లారు. కానీ ఎంతసేపటికీ తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు, బంధువులు కూరగాయల దుకాణంతోపాటు చుట్టుపక్కల గాలించారు. కానీ ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పోలీసులకు సమాచారం అందిం చారు. సీఐ అంకమరావు తన సిబ్బందితో కలిసి దుకాణం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. ఆ ప్రాంతంలో ఓ చోట రక్తపు మరకలు, కళ్లజోడు, చెప్పులు కనిపించడంతో ఏమైందోనని కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. కూరగాయల దుకాణం మూసివేసి ఉండటం, దాని నిర్వాహకుడు కూడా కనిపించకుండా పోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలేం జరిగింది... ? ఆ ఇద్దరు మహిళలు ఏం అయ్యారు.. ఎక్కడికి వెళ్లారనే విషయాలపై. పోలీసులు విచారిస్తున్నారు. విషయం తెలుసుకున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

ఉదయగిరిరూరల్, ఫిబ్రవరి 13: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం కృష్ణంపల్లి గ్రామానికి చెందిన తుపాకుల లక్ష్మీదేవి నుంచి రెండు ఫుల్, 4 క్వార్టర్ బాటిళ్లను ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రజావేదిక నిర్వహణపై అసహనం

● అధికారుల తీరుపై వైసీపీ నేతల మండిపాటు


అసహనం వ్యక్తం చేస్తున్న రామాంజనేయులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 13: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం డ్వామా పీడీ వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ ప్రజావేదిక నిర్వహణ తీరుపై వైసీపీ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. దీంతో కొంతసేపు ఉత్కంఠ నెలకొంది. మండలంలో ఉపాధి పనులపై ఇటీవల సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఈ క్రమంలో ఈనెల9న ప్రజావేదిక నిర్వహించాల్సి ఉండగా వాయిదా వేశారు. మంగళవారం నిర్వహించగా పీఏసీఎస్ చైర్మన్ గుంటుపల్లి రామాంజనేయులు వేదిక వద్దకు చేరుకొని అధికారులను నిలదీశారు. సమాచారం తెలపకుండానే మొక్కుబడిగా నిర్వహించడం ఎంతవరకు సమంజసమని అసహనం వ్యక్తం చేశారు. సర్పంచి, పంచాయతీ కార్యదర్శుల సంతకాలను ఫోర్జరీ చేసి, పనులు చేపట్టారని కాంచెరువు సర్పంచి భర్త మందలపు తిరుపతినాయుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. అలాగే గణేశ్వరాపురంలోనూ ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు 1100 సిమెంటు బస్తాలు ఇచ్చి ఎంబుక్కులో మాత్రం 2వేలు మంజూరు చేసినట్లు నమోదు చేశారంటూ వైసీపీ నాయకులు బాదం వెంకటనారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు.

● రికవరీకి ఆదేశం

కాగా మండలంలో పలు పంచాయతీల్లో చోటు చేసుకున్న అవినీతికి సంబంధించి రూ. 47,675 రికవరీకి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏపీడీ గాయత్రీదేవి, ఎంపీడీవో శ్రీదేవి, ఏపీఎం ఆజమ్‌ఖాన్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

300 పుస్తకాల బహూకరణ


మాట్లాడుతున్న హెచ్ఎం అనంతలక్ష్మి

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి ఆమంచర్ల నటరాజన్ జ్ఞాపకార్థం ఆయన కుమార్తె సరళాదేవి 300 పుస్తకాలను మంగళవారం బహూకరించారు. అనంతరం నటరాజన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అనంతలక్ష్మి మాట్లాడుతూ పుస్తక పఠనంతో విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడం సులభమని తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ వంటేరు మల్లికార్జున, ఉపాధ్యాయులు డాక్టర్ ప్రసాద్, మధుసూదన శాస్త్రి, బీసీ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం


నగదు అందుకుంటున్న క్రీడాకారుడు

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 : పట్టణానికి చెందిన జాతీయ క్రీడాకారుడు పీ సాయికిరణ్‌కి డాక్టర్ బీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి అందజేసిన రూ. 10వేల నగదును మంగళవారం రిటైర్డ్ హెచ్ఎం ఎండీ సాధిక్‌హుస్సేన్ అందజేశారు. సాయికిరణ్ నాలుగేళ్లుగా మాస్టర్‌లార్ట్స్‌లో భాగమైన పెన్‌కాక్ శిలాత్ క్రీడలో జాతీయ స్థాయిలో కాంస్య పతకం, సౌత్ ఇండియా స్థాయిలో నాలుగు బంగారు పతకాలు సాధించాడు. ఈ క్రమంలో మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు ఈ ఆర్థిక సాయం అందచేశారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

అనంతసాగరం, ఫిబ్రవరి 13: మండలంలో పలు అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతసాగరం బస్టాండ్ సెంటర్‌లో దివంగత మాజీ జడ్పీటీసీ బుట్టి కృష్ణారెడ్డి పేరిట ఆయన కుటుంబ సభ్యులు నిర్మించిన బస్టాండ్ ప్రాంగణాన్ని ప్రారంభిస్తారు. అలాగే పశువైద్యశాల భవనం, ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్మించిన అతిథి గృహం, సచివాలయం-2 భవనాలను ఆయన ప్రారంభిస్తారని తెలిపారు.

సచివాలయాల తనిఖీ

అనంతసాగరం, ఫిబ్రవరి 13: మండలంలోని అనంతసాగరం, లింగంగుంట గ్రామ సచివాలయాలను ఎంపీడీవో తాజ్‌మన్రూర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

సీతారామపురం, ఫిబ్రవరి 13 : సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని ఎంపీడీవో ఎస్‌కే అబ్దుల్ కలాం ఆజాద్ కోరారు.ఆయన మంగళవారం పబ్బులేటిపల్లి సచివాలయాలన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజు మూడు నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహి ంచాలన్నారు.అనంతరం పలు రిజిష్టర్ల పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవి,పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర,డీపీ జెలిల్ తదితరులు పాల్గొన్నారు.

గానుగపెంటపెల్లిలో ఆరోగ్య సురక్ష

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని గానుగపెంటపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డిలు మాట్లాడుతూ ఆయుష్మాన్‌భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం రోగులకు వైద్యులు పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి ఎస్ వరలక్ష్మి, వైద్యులు శివకల్పన, షంషుద్దీన్, అనుసిక్తా, నాయకులు జీ.శ్రీనివాసులురెడ్డి, శ్రీరాములు, వెంకటమ్మ, హెచ్ఈ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

సంగం, ఫిబ్రవరి 13: స్థానిక తూర్పుదళితవాడలోని మాతాపరమేశ్వరి ఆలయంలో మాఘ మాసం సందర్భంగా మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు ఆధ్వర్యంలో వ్రతం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాలకు శుభ్రమైన తాగునీరు


వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లాలా తదితరులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 : మున్సిపాలిటీలోని అన్ని ప్రాంతాల ప్రజలకు శుభ్రమైన తాగునీటిని అందించే దిశగా ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లాలా తెలిపారు. మంగళవారం ఆయన పట్టణ ప్రజలకు శుద్ధిచేసిన తాగునీటిని సరఫరా చేస్తున్న వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆ ప్రాంతంలో అపరిశుభ్రంగా ఉండడంతో యుద్ధప్రాతిపదికన శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అలసత్వం తగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, ఏఈ జూపల్లి ప్రసాద్, ఆర్ఐ షేక్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

జీవోల విడుదలకు మున్సిపల్ కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 : మున్సిపల్ కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందం మేరకు జీవోలను విడుదల చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ జీవోలను ప్రభుత్వం విడుదల చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం కమిషనర్ ఫజుల్లాలాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జే నాగరాజు, బీ హజరత్తయ్య, ఎం చెంచయ్య, టీ నాగార్జునరావు తది తరులు పాల్గొన్నారు.

మర్రిపాడులో విజయీభవ యాత్ర


మంచినీటి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన విజయీభవ యాత్రలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా బస్టాండ్ సెంటర్‌లో నిర్మించిన బస్‌షెల్టరును ప్రారంభించారు. అనంతరం బైక్ ర్యాలీగా వెళ్లి ఎస్సీ కాలనీలో మంచినీటి ప్లాంట్‌ను, బాలుపల్లిలో ఆర్‌బీకేను, పాలకేంద్రాన్ని ప్రారంభించి, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నేతలు శ్రీనివాసులు నాయుడు, సోమల మాదవ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం మండలంలోని అయ్యవారిపల్లి, సింగరెడ్డిపల్లి గ్రామాల్లో విజయ సంకల్ప యాత్ర పేరుతో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రమణ రెడ్డి,ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి,వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి, బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచి దుగ్గయ్య, ఎంపీటీసీ పాలగిరి అల్లూరురాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోల వద్ద ఓటర్ల జాబితా

చేజర్ల, ఫిబ్రవరి13 : మండలంలోని అన్ని గ్రామాల ఓటర్ల జాబితా ఆయా బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉందని తహసీల్దార్ కే.గోపీక్రిష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వాటిని ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద కూడా డిస్‌ప్లే చేశామన్నారు. ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వారు గ్రామాల్లో బీఎల్‌వోలు విచారణ అనంతరం స్వీకరిస్తామన్నారు. కొత్తగా చేరేవారు ఫారం-6ను పూర్తి చేయాలని తెలిపారు.

డీటీ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 13: డిప్యూటీ తహసీల్దారు(డీటీ)గా పీ.కృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డీటీ ఫజిహను సీతారామపురానికి బదిలీ చేశారు. చేజర్ల డీటీగా పనిచేస్తున్న పీ.కృష్ణను ఇక్కడికి బదిలీ చేశారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని దుర్గంపల్లి పాఠశాలలో మంగళవారం ఎంఈవో షేక్ మస్తాన్‌వలి మనబడి నాడు-నేడు రెండో విడత పనులను పరిశీలించారు. మరుగుదొడ్ల పనులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. అనంతరం విద్యార్థుల అభ్యసన, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాఫర్‌అహ్మద్, వెంకటరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మరుగుదొడ్లు పరిశీలిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సీఎం జగన్ గిరిజనులను ఉద్ధరించిందేమీ లేదు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కావలి, ఫిబ్రవరి 13: వైసీపీ పాలనలో సీఎం జగన్ గిరిజనులను ఉద్ధరించింది ఏమీ లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, గిరిజన నేత మొగిలి కల్లయ్య తెలిపారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో కల్లయ్య మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా ఈ ప్రభుత్వం దుర్మార్గ పాలన చేసిందన్నారు. అందరూ ఏకమై తిరుగుబాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 16 గిరిజన సంక్షేమ పథకాలు తొలగించి, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నిర్వీర్యం చేస్తూ గిరిజనులకు సీఎం జగన్ తీరనిద్రోహం చేశారన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులనే గిరిజనులు అడుగుతున్నారు తప్ప వైసీపీ నేతల అక్రమాలలో వాటాలు అడగటంలేదన్నారు. గిరిజనుల హక్కులను కాలరాసిన జగన్మోహన్ రెడ్డి రాజ్యాంగబద్ధమైన పదవికి ఎలా అర్హుడవుతాడన్నారు. రాష్ట్రంలోని గిరిజనులంతా ఏకమై ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, నాయకులు గుండ్లపల్లి మురళి, శివ, అంబటి కిషోర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు : ఏపీజీబీ ఆర్ఎం


ఖాతాదారులతో మాట్లాడుతున్న ఏపీజీబీ ఆర్ఎం

కావలిరూరల్, ఫిబ్రవరి 13: ఖాతాదారులకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో అందిస్తున్న మెరుగైన సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లుతున్నట్లు ఆ బ్యాంక్ రీజనల్ మేనేజరు మోహన్‌రెడ్డి తెలిపారు. కావలిరూరల్ మండలం రుద్రకోట ఆంధ్రప్రగతి బ్యాంకు పరిసర ప్రాంతాల ప్రజల వద్దకు మంగళవారం ఆయన వెళ్లి ఖాతాదారులతో నేరుగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు సేవలను పూర్తిగా వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. సమీపంలోని రామాయపట్నం పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం రైతుల భూములు తీసుకుని ఇస్తున్న పరిహారంను అధిక వడ్డీ కోసం ఇతరులకు ఇచ్చి మోసపోవద్దన్నారు. బ్యాంకు సేవలను ఉపయోగించుకుని ఆర్థిక భద్రత పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రకోట బ్రాంచి మేనేజరు శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

కందుకూరు, ఫిబ్రవరి 13: కందుకూరు పట్టణంలో ఇటీవలి కాలంలో మృతి చెందిన నలుగురు గృహసారథుల కుటుంబాలకు ఎమ్మెల్యే మహీధరరెడ్డి మంగళవారం ఆర్థిక సహాయం అందించారు. శ్రీనగర్ కాలనీకి చెందిన పారాబత్తిన మాధవరావు, శ్రీరామకాలనీకి చెందిన కలిశెట్టి బాలకోటయ్య, కేసరిగుంట కాలనీకి చెందిన పొట్లూరి నాగభూషణం, సంతోష్‌నగర్‌కు చెందిన షేక్ అమీర్ బాషాల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.75వేలు వంతున మహీధరరెడ్డి వ్యక్తిగతంగా ఆర్థికసహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

● మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా



కావలి : మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా



కందుకూరు : ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కావలి, ఫిబ్రవరి 13: మున్సిపల్ కార్మికులకు సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధసంస్థ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఈ ధర్నాలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమ్మెకాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు విడుదల చేసిన జీవోలను అమలు చేయాలని మిగిలిన హామీలకు సంబంధించిన జీవోలను విడుదల చేయాలని కోరారు. డ్రైవర్లుకు హెల్త్ అలవెన్స్ రూ.6,000 ఇవ్వాలని, కార్మికులకు పండుగ అడ్వాన్స్ వెయ్యి రూపాయలు ఇవ్వాలని, సమ్మెకాలపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే డైలీ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, కార్మికులకు సబ్బులు, కొబ్బరినూన్, చెప్పులు, యూనిఫాం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లె అంకయ్య, కార్యదర్శి గుంజి కిషోర్, కావలి అధ్యక్షుడు ఎండ్లూరి ఆదినారాయణ, కార్యదర్శి తన్నీరు వెంకటేష్, సహకార్యదర్శి వై.రవి, గుంజి అంకయ్య, తన్నీరు పద్మ, రాజేష్ పాల్గొన్నారు.

కందుకూరు : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపు జీవోను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో యూనియన్ నాయకురాలు కాకుమాని రమణమ్మ మాట్లాడుతూ ఇటీవల డిమాండ్ల సాధనకై మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెచేసిన సందర్భంలో జీతాలు పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు సమ్మె విరమించామని, అయితే నేటికీ వేతనాల పెంపుకై జీవో విడుదల చేయకపోవడం దారుణమని విమర్శించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బూసి సురేష్‌బాబు, వై.ఆనంద్ మోహన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు నాగేశ్వరరావు, మహేంద్ర, కత్తి మహేష్, శేషమ్మ, వెంకటలక్ష్మి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే జేవీవీ లక్ష్యం


కళాజాత ప్రదర్శనలో జేవీవీ ప్రతినిధులు

కందుకూరు, ఫిబ్రవరి 13: విద్యార్థులలో ప్రశ్నించేతత్వం, శాస్త్రీయదృక్పథం పెంపొందించడమే జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) లక్ష్యమని రాష్ట్ర నాయకుడు మురళీధర్ పేర్కొన్నారు. జేవీవీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ కళాజాత ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జాత కన్వీనర్ మురళీధర్ మాట్లాడుతూ మారుతున్న సమాజంలో అశాస్త్రీయ ధోరణులు పెరిగిపోతున్నాయని, పర్యావరణ కాలుష్యం అధికమవుతున్నదని, సాంకేతిక విజ్ఞానం యువతను పెడదోవ పట్టిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా సమాజంలో మార్పు తేవటమే లక్ష్యంగా జేవీవీ కళాజాతలకు రూపకల్పన చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు త్రిమూర్తులు, కే.కృష్ణారెడ్డి, జీవీ మాల్యాద్రి, విప్రనారాయణ, మహల్యారావు, శరత్, చిత్తారు వెంకటేశ్వర్లు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాన్ని పరిశీలించిన అధికారులు


విచారిస్తున్న తహసీల్దారు దుర్గేశ్వరరావు

అల్లూరు, ఫిబ్రవరి 13 : మండలంలోని ఇందుపూరు దళితవాడలో వివాదాలకు కారణమైన ఆక్రమిత స్థలాన్ని తహసీల్దారు ఎస్.దుర్గేశ్వరరావు, ఎంపీడీవో జ్యోతి మంగళవారం పరిశీలించారు. ఓ ఆలయానికి చెందిన పూజారి స్థలం ఆక్రమణతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంతర్గత రోడ్డును సైతం ఆక్రమించాడని గ్రామస్థులు తహసీల్దారు దృష్టికి తీసుకురాగా తాము ఎటువంటి ఆక్రమణలు చేసుకోలేదని, రోడ్డు భక్తుల విరాళాలతో నిర్మించామని, దీనిని గ్రామస్థులు కొందరు అడ్డుకుంటున్నారని ఆ పూజారి తెలిపారు. గతంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన నివేశన స్థలాలు కావడంతో ఆ స్థలాల లబ్ధిదారుల పేర్లు, స్థలాల వివరాలను గ్రామస్థులు, అధికారుల నుంచి సేకరించి రికార్డులు పరిశీలించారు. పూర్తిస్థాయిలో పరిశీలించి తరుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గరిమెనపెంటలో 'జగనన్న సురక్ష-2'


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కొండాపురం, ఫిబ్రవరి 13: మండలంలోని గరిమెనపెంట సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఏ.భవ్య రోగులకు పరీక్షలు నిర్వహించారు. 66 మందికి కంటి పరీక్షలుచేసి 48 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. అవసరమైన మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎంవీ నారాయణరావు, మండలపరిషత్ కార్యాలయ సీనియర్ సహాయకులు వీవీ.ప్రభాకర్, సీహెచ్‌వో చెంచురామయ్య, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన కందుకూరు విద్యార్థిని


చంద్రిక

కందుకూరు, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ ఫలితాలలో పట్టణంలోని శ్రీ గాయత్రీ జూనియర్ కళాశాల విద్యార్థిని కె.చంద్రిక 96.09 పర్సంటైల్‌తో అత్యుత్తమ ర్యాంకు సాధించిందని కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు తెలిపారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన చంద్రిక పట్టుదల, దీక్షతో చదివి ఈ ర్యాంకు సాధించి అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించటమే గాక ఎన్ఐటీలో మంచి బ్రాంచిలో ఇంజనీరింగ్ చేసే అవకాశం దక్కించుకుందని తెలిపారు. ఏప్రిల్‌లో మరోసారి మెయిన్స్‌కు హాజరయ్యే అవకాశం ఉన్నందున పర్సంటైల్‌ను మెరుగుపరుచుకోవటమే లక్ష్యంగా కృషి చేస్తానని చంద్రిక పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి నుంచి రూ.10 లక్షల మంజూరు

కందుకూరు, ఫిబ్రవరి 13: ఉలవపాడు మండలం చాకిచర్ల గ్రామానికి చెందిన సుదర్శి వెంకటేశ్వర్లుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షల మంజూరు కాగా మంగళవారం బాధితుడికి చెక్కును అందజేశారు. సుదర్శి వెంకటేశ్వర్లుకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరం కాగా తిరుపతిలోని ఓ కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం అవసరమైన పది లక్షలను ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు సీఎం సహాయనిధి నుంచి మంజూరు చేయించారు. మాధవరావు ప్రతినిధి తిరుపతిలో బాధితుడికి ఈ చెక్కును అందజేశారు.

కందుకూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి

కందుకూరు, ఫిబ్రవరి 13: కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని బీజేపీ కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత, ప్రస్తుత పాలకులు ట్రాఫిక్ సమస్యను ఎన్నికల సమయంలో ప్రస్తావించడం ఆ తర్వాత విస్మరించడం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. ప్రధాన వీధులలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిపోవడానికి పాలకుల ముందుచూపులేని పాలనా విధానమే కారణమని తెలిపారు. ఫుట్‌పాత్‌లు దెబ్బతినిపోయి ప్రజలు నడిచేందుకు వీలులేకుండా పోయినా వాటికి మరమ్మతులు చేయలేదని పేర్కొన్నారు. కనిగిరి రోడ్డులో ఎల్ఐసీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు, పోస్టాఫీసు సెంటర్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు, వెంకటనారాయణ బజారు, పెద్దబజారులలో ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రివరకు ప్రజలు అవస్థలు పడుతున్నా పాలకులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మాస్టర్‌ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పోలేరమ్మకు వైభవంగా గ్రామ పొంగళ్లు


గాజుల అలంకారంలో పోలేరమ్మ

బిట్రగుంట, ఫిబ్రవరి 13: బోగోలు మండలం నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డి పాలెం కొత్తూరులో వెలసిన పోలేరమ్మ ఆలయ 9వ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం గ్రామ పొంగళ్ల కార్యక్రమం వైభవంగా జరిగింది. అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించారు. గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమించారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, మొక్కుబడుల కార్యక్రమాలు జరిగాయి.

పేదలకు భారంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు!

● నిర్మించుకోకుంటే పట్టాలు రద్దు చేస్తామని బెదిరింపు ● అధికారుల ఒత్తిడితో శంకుస్థాపన ● పిల్లర్ల దశ దాటని వైనం


వలేటివారిపాలెంలో పిల్లర్ల దశ దాటని ఇల్లు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 13 : మండలంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పేదలకు భారంగా మారాయి. సొంతిల్లు వస్తుందన్న ఆశకు ఐదేళ్లు పూర్తవుతున్నా కలమాత్రం నెరవేరలేదు. ముందుగా తామే ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అప్పగిస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు, అధికారులు అంతలోనే లబ్ధిదారుడే నిర్మించుకోవాలని చెప్పారు. ఎవరికి ఎలా ఇష్టమైతే అలా నిర్మించుకుంటానంటే దానికి అవకాశం ఇస్తాం అని గొప్పగా చెప్పారు. దీంతో పెరిగిన ధరలు, సౌకర్యాలు లేని ప్రాంతాల్లో ఇల్లు కట్టుకోవాలంటే కష్టమేనని లబ్ధిదారులు వెనకంజ వేశారు. దీంతో లబ్ధిదారులపై దండోపాయాలు మొదలుపెట్టారు. ఇంటి పనులు మొదలు పెట్టకపోతే ఇచ్చిన స్థలాన్ని రద్దు చేస్తామంటూ అధికారులు ఒత్తిడి చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో లబ్ధిదారులు అక్కడక్కడ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి పునాదుల వేసి వదిలేశారు. ఈ విధంగా మండలంలోని 21 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో పోలినేనిపాలెం, జమీన్‌ఉప్పలపాడు, చుండి పంచాయతీలలో లేఅవుట్‌లు వివిధ కారణాలతో కోర్టులో ఉన్నాయి. మిగిలిన పంచాయతీలలో 33 లేఅవుట్‌లు వేసి 841 మందికి పట్టాలు ఇచ్చారు. అయితే అంకభూపాలపురంలో 35 ఇళ్లు, కాకర్లవారిపాలెంలో 8, నలదలపూరులో 3, శామీరపాలెం ఎస్టీ కాలనీలో 2, వలేటివారిపాలెంలో 4, అమ్మపాలెంలో 4 ఇళ్లు మాత్రమే పనులు ప్రారంభించారు. జగనన్న కాలనీల్లో ఇల్లు నిర్మించుకోడానికి ప్రభుత్వం 4 విడతల్లో రూ.1.80 లక్షలు చెల్లిస్తుంది. నిర్మాణానికి అవసరమైన 90 కట్టలు సిమెంటు, 482 కిలోల ఇనుము, అందిస్తారు. వీటికి సంబంధించిన మొత్తాన్ని రూ.1.80 లక్షల్లో మినహాయించుకుంటారు. ఈ క్రమంలో పెట్టుబడులు పెట్టలేక ఇళ్ల నిర్మాణాలకు మంగళం పాడారు. దీంతో అధికారులు, వలంటీర్లు ఫోన్లు చేసి ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో ఏమి చేయాలో అర్థంకాని అయోమయస్థితిలో ఉన్నారు. ఇంటి నిర్మాణం చేపడితే అప్పుల పాలవడం ఖాయమని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

చలో మనుబోలును జయప్రదం చేయండి

వెంకటాచలం, ఫిబ్రవరి 13: చలో మనుబోలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పఠాన్ ఖయ్యూమ్ ఖాన్, నియోజకవర్గ మైనార్టీ నేతలు షేక్ సత్తార్ సాహెబ్, ఎంఎస్ హనిఫ్, జమాల్, అన్వర్, షేక్ షరీఫ్, రఫీ, అబ్దుల్లా, జలీల్ ఒక ప్రకటనలో కోరారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మనుబోలు కోదండరామపురం వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో ఈ నెల 20న మైనార్టీల సమావేశం జరుగుతుందని వారు తెలి పారు.

గ్రామాలు అంధకారంలో ఉంటే పట్టించుకోరా ? : బీజేపీ

వెంకటాచలం : అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు స్తంభాలను ఢీకొని, మూడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినా అధికారులు పట్టించుకోరా.. ? అని బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీని వాసులు యాదవ్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. సోమవారం అర్ధరాత్రి ఇస్కపాళెంలో విద్యుత్ స్తంభాలను గ్రావెల్ టిప్పర్ ఢీకొనడంతో తీగలు తెగి స్తంభాలు నేలకొరిగాయన్నారు. దీంతో గత 24 గంటల నుంచి విద్యు త్ సరఫరా లేక నిడిగుంటపాళెం, పుంజులూరుపాడు, ఇస్క పాళెం గ్రామాలు అంధకారంలో ఉన్నాయన్నారు. విద్యుత్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆరోగ్యమే మహాభాగ్యం : పోర్టు సీవోవో

ముత్తుకూరు : ఆరోగ్యమే మహాభాగ్య మని అదానీ కృష్ణపట్నం పోర్టు సీవోవో రాజన్‌బాబు పేర్కొ న్నారు. మంగళవారం పోర్టు ఆధ్వర్యంలో గోపాలపురం లోని సీవీఆర్ కాంప్లెక్స్ ఆసుపత్రిలో నారాయణ హాస్పిటల్ వైద్యుల సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్యమే లక్ష్యంగా పోర్టు పని చేస్తుందన్నారు. ఈ మెగా శిబిరంలో సుమారు 265 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, ఈహెచ్ఎస్ హెడ్ వేణుగోపాల రెడ్డి, రమేష్‌బాబు, రాజేష్ రంజన్, మనోహర్‌బాబు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రైతులు సుభిక్షం : కాకాణి

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 13 : వైసీపీ ప్రభుత్వంలో రైతులు సుభిక్షంగా ఉన్నారని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాపిరెడ్డిపాలెం, కోవెరపాలెం గ్రామాల్లో మంగళవారం ఆయన సీసీ రోడ్లు, సైడ్ కాలువలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత, సర్పంచులు కదిరి వెంకటసుబ్బయ్య, తలమంచి సురేంద్రబాబు, వైసీపీ నాయకులు శంకరయ్యగౌడ్, తిరువల్లూరు ఈశ్వరయ్య, కావల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కామాక్షితాయి సేవలో మంత్రి కాకాణి

బుచ్చిరెడ్డిపాళెం : రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు మంగళవారం మల్లికార్జునస్వామి, కామాక్షితాయివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ మావులూరి శ్రీనివాసులురెడ్డి, ఆలయ ఈవో వీ.గిరికృష్ణ, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

బీఎస్పీని ఆదరించండి

తోటపల్లిగూడూరు : బహుజన సమాజ్ వాది పార్టీ(బీఎస్పీ)ని ఆశీర్వదించాలని బీఎస్పీ సర్వేపల్లి నియోజకవర్గ అభ్యర్థి జానకీప్రసాద్ కోరారు. కొత్తపాలెంలో మంగళవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ప్రభు త్వంలో ఏ ఒక్కరూ సుభిక్షంగా లేరని, మళ్లీ అధికారంలోని వస్తే రాష్ట్రాన్నే అమ్మేస్తారని దుయ్యబట్టారు. కార్యక్రమం లో పార్టీ నాయకులు రామచంద్రయ్య, హరిబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ డీఎస్పీ బదిలీ

నెల్లూరు(క్రైం) ఫిబవరి 13: నెల్లూరు నగర ట్రాఫిక్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ సుభాన్‌ను కృష్ణా జిల్లా మచిలీపట్నం డీఎస్పీగా బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ఆర్ల శ్రీనివాసులును నెల్లూరు నగర ట్రాఫిక్ డీఎస్పీగా నియమించారు. త్వరలోనే ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

● మద్యం సీసాల స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న 337 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని దర్గామిట్ట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి దాడుల వివరాలను మంగళవారం మీడియాకు తెలిపారు. ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 262, స్కూటీలో తరలిస్తున్న 75 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు.

సర్వేపల్లిలో కొనసాగుతున్న వలసలు : సోమిరెడ్డి



టీడీపీలో చేరినవారితో మాజీ మంత్రి సోమిరెడ్డి

వెంకటాచలం, ఫిబ్రవరి 13: సర్వేపల్లి టీడీపీలోకి వైసీపీ నుంచి వలసలు కొనసాగుతున్నాయని, వచ్చే ఎన్నికల నాటికి ఆ పార్టీ ఖాళీ అవ్వడం ఖాయమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వెంకటాచలం మండలం చెముడుగుంట దళితవాడ నుంచి 16 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సర్వేపల్లిలో మంత్రి కాకాణి అరాచకాలు, దౌర్జన్యాలకు అడ్డూఅపూ లేకుండా పోయాయని విమర్శించారు. ఆయన చేసే అరాచకాలను సహించలేకే యువత పెద్దఎత్తున టీడీపీలో చేరటం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు గుమ్మడి రాజాయాదవ్, దొడ్ల అశోక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

● యువత అంకితభావంతో పనిచేయండి

రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం యువత అంకితభావంతో పని చేయాలని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నెల్లూరులోని సోమిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో మండల యువతకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రత్యేక హోదా, జాబ్ క్యాలెండర్, పరిశ్రమలకు పెద్దపీట అని చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యువతకు దగా చేశారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే యువతకు మంచి అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి రాజాయాదవ్, మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు, పాకం శ్రీకాంత్‌రెడ్డి, కందిమళ్ల సతీష్, నలబాలపు వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

● త్వరలో కాకాణి అవినీతి చిట్టా విప్పుతా...

మనుబోలు: త్వరలోనే మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతి చిట్టాను విప్పుతానని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బిద్దెవోలులో మంగళవారం సాయంత్రం జరిగిన బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో కొండలు, గుట్టలు అన్ని మాయమయ్యాయని, ఇసుక దోపిడీ జరిగిందన్నారు. కృష్ణపట్నం పోర్టు వద్ద టోల్ టాక్స్ కొల్లగొట్టారని దుయ్యబట్టారు. కాకాణి వల్ల కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ మూతపడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, గాలి రామ కృష్ణారెడ్డి, మస్తాన్‌నాయుడు, పచ్చిపాల రామిరెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, మధునాయు డు, వెంకటకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం : కురుగొండ్ల



కరపత్రం అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ

సైదాపురం,ఫిబ్రవరి13: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పొక్కందల, ఆదూరుపల్లి గ్రామాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టోపై మహిళలకు అవగాహన కల్పించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిశీలకుడు జెన్ని రమణయ్య, నాయకులు సుబ్రహ్మణ్యం, నలమారు వెంకటేశ్వర్లురెడ్డి, పాములూరు శ్రీనివాసులునాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, బెల్లంకొండ మస్తాన్ నాయుడు, మేడికొండ రమణయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మకు పొంగళ్లు



పొంగళ్ల బుట్టలతో మహిళలు

పొదలకూరు, ఫిబ్రవరి 13: పంచాయతీ పరిధిలోని చిట్టేపల్లి గ్రామస్థులు మంగళవారం పొదలకూరు గ్రామ దేవత పోలేరమ్మకు వైభవంగా పొంగళ్లు నిర్వహించారు. ప్రత్యేక బుట్టలతో చిట్టేపల్లి నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి చేరుకుని నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కోవూరు బక్కయ్య నాయుడు, గొర్ల సుధాకర్‌నాయుడు, కామినేని మల్లికార్జున్‌నాయుడు, బెల్లంకొండ మస్తానయ్యలు మాట్లాడుతూ సకాలంలో వానలు కురిసి, గ్రామమంతా పాడి, పంటలు సుఖసం తోషాలతో వర్ధిల్లాలని ప్రతిఏటా అమ్మవారికి పొంగళ్లు పెడుతున్నామన్నారు.

● ప్రజలకు పోలేరమ్మ దీవెనలు ఉండాలి

పోలేరమ్మ చల్లని దీవెనలు నియోజకవర్గంలోని ప్రజలపై ఉండాలని టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సయస్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామ పొంగళ్లలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారధి నిర్మాణాన్ని అడ్డుకున్న రైతులు



పనులు వద్ద బైఠాయించిన రైతులు

కోవూరు, ఫిబ్రవరి 13: మండలంలోని పాటూరు రోడ్డులో కోవూరు చెరువు కలుజుపై నిర్మిస్తున్న వారధి వల్ల తమ ప్రాంత రైతులకు ఇబ్బందులు వస్తాయని చెర్లోపాళెం, ఇనమడుగు, మోడేగుంట ప్రాంత రైతులు వారధి నిర్మాణ పనులను మంగళవారం అడ్డుకున్నారు. చెరువు కలుజుపై ఎత్తు తగ్గించి వారధి నిర్మిస్తే తమ ప్రాంత పొలాలకు సాగునీరు అందదని రైతులు పేర్కొన్నారు. ఇటీవలనే రూ.1.8 కోట్లతో వారిధి నిర్మించేందుకు నీటి పారుదల శాఖాధికారులు పనులు ప్రారంభించారు. రైతులు నిర్మాణ పనులను అడ్డుకోవడంతో కంట్రాక్టరు నీటి పారుదల శాఖాధికారులకు సమాచారం అందించి పనులు నిలిపివేశారు.

మైనార్టీ నేతకు పరామర్శ

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 13: పట్టణంలోని మైనార్టీ నేత ముక్తార్‌ను మంగళవారం మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి సోదరుడు సునీల్ కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, ముందుగా మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, అతర్వాత మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. ఇక గ్రామాల్లో ఎవరైనా మరణిస్తే చాలు సమాచారం లేకున్నా వారి కుటుంబాలను పరామర్శించడానికి రాజకీయ నాయకులు క్యూ కడుతున్నారు. ఎన్నికల సమయం కదా? పిలిచినా, పిలవకున్నా నేతలు వస్తారని జనం అనుకుంటున్నారు.

ముగిసిన రోడ్డు భద్రత మాసోత్సవాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 13: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న 35వ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ముగిశాయి. నగరంలోని ఆర్టీసీ రెండవ డిపో గ్యారేజ్‌లో ముగింపు సభను మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీటీసీ బీ చందర్ మాట్లాడుతూ రోడ్డు నియమాలు పాటిస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. అనంతరం ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈడీ కే ఆదామ్ సాహెబ్, ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్, ఆర్టీసీ ఆర్ఎం పీవీ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

షర్మిలపై వ్యాఖ్యలు అన్యాయం

● సరోజనీ నాయుడు జయంతిలో డీసీసీ అధ్యక్షుడు చేవూరు



సరోజనీకి నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 13 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కొందరు వైసీపీ నేతలు విమర్శించటం, నోటికొచ్చినట్లు అత్యంత నీచంగా వ్యాఖ్యలు చేయటం అన్యాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య సమరయోధురాలు దివంగత సరోజనీ నాయుడు జయంతి వేడుకలు మంగళ వారం ఇందిరాభవన్‌లో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ వైసీపీ పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని షర్మిలా ఆందోళన వ్యక్తం చేశారన్నారు. షర్మిలపై నీచమైన వ్యాఖ్యలు చేస్తున్న నాయకులను అదుపు చేయటంలో సీఎం జగన్ విఫలమయ్యారని దుయ్యబట్టారు. జగతి మీడియా గ్రూప్ అధినేత జాలే వాసుదేవ నాయుడు షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నందుకు స్వాగతం పలుకుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు, పీసీసీ అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్‌బాబు, నగర అధ్యక్షుడు షేక్ ఫయాజ్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ఏటూరి శ్రీనివాసులరెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కొండా అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో డిగ్రీ విద్యార్థి కిడ్నాప్

● విడిపించిన పోలీసులు.. నిందితుల అరెస్టు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 13: డిగ్రీ విద్యార్థిని కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి జిల్లా వాకాడు మండలానికి చెందిన సాయినందన్ నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతూ నగరంలోని ఓ గదిలో అద్దెకు ఉంటున్నారు. ఆయనకు బుజబుజ నెల్లూరుకు చెందిన వంశీకుమార్‌తో పాతకక్షలున్నా యి. ఈ నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ రాత్రి సాయిచందన్ తన స్నేహితునితో కలిసి బృందావనంలోని గణేష్ మెస్ వద్ద ఉండగా వంశీకుమార్ తన స్నేహితులతో కలిసి కారులో అక్కడకు చేరుకున్నాడు. సాయినందన్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకున్నాడు. అడ్డుకో బోయిన స్నేహితుడు జస్వంత్‌ను తోసేసి అక్కడి నుంచి పరారయ్యారు. కిడ్నాప్ సంఘటనపై జశ్వంత్ సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నాపర్లు సాయినందన్‌ను కనుపూరు వద్దకు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేశారు. పోలీసులు సాంకేతికత ఆధారంగా సంఘటనా స్థలానికి చేరుకుని సాయినందన్‌ను విడిపించారు. నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సందడి అరుణకు ఘన సన్మానం

నెల్లూరు (సాంస్కృతికం) : అడుగంటిపోతున్న సంప్రదాయ చిత్రాలు, వాస్తవికతకు దగ్గరగా అరుదైన చిత్రాలు గీస్తున్న చిత్రకారిణి సందడి అరుణకు మంగళవారం ఘనంగా సత్కారం జరిగింది. మాగుంట లే అవుట్‌లో నెల్లూరుజిల్లా రచయితల సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు అభినందనలు తెలిపారు. ఫిబ్రవరి 10, 11 తేదీలలో తిరుపతి ఆర్ట్స్ సొసైటీ చిత్రలేఖన పోటీల్లో సందడి అరుణ చిత్రాలకు ప్రశంసలు అందాయి. ఆ పోటీల్లో తను రచించిన పుస్తకాన్ని కూడా ప్రదర్శిం చారు. ఈ సభలో ఆమెను నెల్లూరు రచయితల సంఘం అధ్యక్షుడు ఏ జయప్రకాష్, భారతి, షేక్ నజ్మా, తదితరులు సన్మానించారు.

దౌర్జన్యాలు పోవాలంటే చంద్రబాబు రావాలి



ప్రచారంలో కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 13: రాష్ట్రంలో దౌర్జన్యాలు పోవాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, నెల్లూరులో దోమలు పోవాలంటే నారాయణ నగర ఎమ్మెల్యే కావాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. నగరంలోని 15వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ అంచురి శ్రీనివాసులు నాయుడుతో కలిసి మంగళవారం పర్యటించారు. నారాయణ నగర ఎమ్మెల్యే అయితే ఆగిపోయిన డ్రైనేజీ పనులు పూర్తయి నెల్లూరు నగరం దోమలు లేని నగరంలా మారుతుందని, ప్రజలు ప్రశాంతంగా నిద్ర పోవచ్చన్నారు. ఓటర్లందరూ సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కోటంరెడ్డి ఇంటింటా ప్రచారం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 13 : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సతీమణి సుజాతమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి కోరారు. వనంతోపు, నక్కలగుంట ప్రాంతాలలో వారు మంగళవారం పర్యటించారు

ప్రజా సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యం

● 'ప్రతి అడుగు ప్రజల కోసం' 100 రోజుల సంబరాల్లో దినేష్‌రెడ్డి



బుచ్చిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 13: నియోజకవర్గంలో ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యంగా ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమం ప్రారంభించినట్లు కోవూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమం మంగళవారంతో 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెంలో సుమారు 500 బైక్‌లతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులతో కలసి ఆయన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కేఎం.ఆసుపత్రి వద్ద నుంచి ప్రారంభమై జాతీయ రహదారిమీదుగా గాంధీబొమ్మ సెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్, చెన్నూరు రోడ్డు, పోలీస్‌స్టేషన్ మీదుగా అంబేద్కర్ నగర్‌లో జరిగిన బహిరంగ సభ వరకు సాగింది. ఈ సందర్భంగా జొన్నవాడ రోడ్డు సెంటర్లో అంబేద్కర్, రాజకిషోర్ థియేటర్ సమీపంలో గాధీమహాత్ముడు, చెన్నూరురోడ్డులో పొట్టి శ్రీరాములు విగ్రహాలకు దినేష్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంవీ.శేషయ్య, హరికృష్ణ, హరనాథ్, రామానాయుడు, వెంకటేశ్వర్లు, చైతన్య, ప్రభాకర్‌రెడ్డి, పుసురుపాటి, కొండయ్య, పురుషోత్తం, తాళ్ళస్వామి, దశరథ శ్రీను, దళిత, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీకి యానాదుల సత్తా చూపిస్తాం

● యానాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య

విడవలూరు, ఫిబ్రవరి 13 : అధికార వైసీపీకి రానున్న ఎన్నికల్లో యానాదుల సత్తా ఏమిటో రుచి చూపిస్తామని యానాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య తెలిపారు. మండలంలోని ముదివర్తి గాంధీ గిరిజన సంఘంలో మంగళవారం ఆయన పర్యటించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన యానాదుల ముఖాముఖి సమావేశంలో ఆయన మాట్లాడుతూ యానాదులకు ఎమ్మెల్సీ, ప్రత్యేక కార్పొరేషన్ ఇస్తామని గత ఎన్నికల్లో మాట ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి అధికారం రాగానే గిరిజనులను మోసం చేశారని ఆరోపించారు. జిల్లాలో ఉన్న 1500 యానాదుల కాలనీలలో 4లక్షల మంది ఉన్నారన్నారు. వీరిని ఎన్నికల్లో పావుల్లా ఉపయోగించుకుని అధికారం చేపట్టగానే వారి సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ముదివర్తిలో అనేక మంది గిరిజనులకు సెంటు భూమి కూడా లేదన్నారు. అనేక మంది కుటుంబాలకు 30 కేజీల బియ్యం రావడం లేదని, ఈ విషయం పాలకులకు, అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో గిరిజనులను ఏ పార్టీ అయితే ఆదరిస్తారో ఆ పార్టీకి మద్దతుగా యానాదుల సంక్షేమ సంఘం నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంఘం మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, జిల్లా చైర్మన్ రావూరి కృష్ణయ్య, సభ్యులు రావూరి రాధమ్మ, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగమే కాపాడుతోంది

● టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 13 : ఏపీలో ప్రస్తుతం సాగుతున్న దుర్మార్గ పాలనలో ప్రజలకు బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగమే రక్షణగా నిలుస్తోందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సజ్జాపురంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సొంత నిధులతో నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన మంగళవారం ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు జెన్ని రమణయ్య, జలదంకి సుధాకర్, ప్రదీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వసంత పంచమి

● ఆలయాల్లో అక్షరాభ్యాసాలు



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 13 : జ్ఞానానికి అధిదేవత అయిన సరస్వతీ దేవి జయంతిని వసంత పంచమిగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆలయాల్లో సరస్వతి పూజలు, విద్యాభ్యాసాలు నిర్వహిస్తారు. వసంత పంచమి తిథి మంగళవారం మధ్యాహ్నం 2.41గంటల నుంచి బుధవారం మధ్యాహ్నం 12.09 గంటల వరకు ఉంది. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరస్వతీ పూజకు శుభ సమయమని వేద పండితులు తెలిపారు. దీనికితోడు శుభ ముహూర్తం కావడంతో బుధ, గురువారాల్లో వేలాది వివాహాలు జరగనున్నాయి. వసంత పంచమి రోజున పసుపు వస్త్రాలు ధరించి సరస్వతీదేవికి పూజలు చేస్తారు. పసుపు రంగు వసంత రుతువుకు చిహ్నం.

● మూలస్థానేశ్వర ఆలయంలోని సరస్వతీ సన్నిధిలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో వేణుగోపాల్ తెలిపారు. ఉదయం అభిషేకాలు, విశేష అలం కారం, పూజలు, సరస్వతీ హోమం, అక్షరాభ్యాసాలు జరుగుతాయన్నారు. అలాగే మహాశివరా త్రి ఉత్సవాలకు సంబంధించి గుంజ ప్రతిష్ఠ జరుగుతుందని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

● స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతీ పూజలు, అక్షరాభ్యా సాలు జరుగుతాయని ఆలయ అర్చకుడు లలితా శివకుమార్ స్వామి తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు ఎల్‌కేజీ నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు అక్షరాభ్యాసం, బీజాక్షరాలు రాయడం జరుగుతుందని పేర్కొన్నారు. వారికి బాసర సరస్వతీ అమ్మవారి డాలరు ఇస్తున్నామని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18న నానీల పురస్కార సభ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 13 : స్వర్గీయ జమున స్మారక జాతీయ నానీల పురస్కారం, డాక్టరు జయప్రద నవలా పురస్కార సభ ఈనెల 18న నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో జరుగుతుందని పెన్నా రచయితల సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఉదయం 10గంటలకు నానీల కవి సమ్మేళనం జరుగుతుందన్నారు. కవులు, రచయితలు, సాహితీ అభిమానులు పాల్గొనాలని కోరింది.

రోడ్డుపై ఇసుక, కంకర గుట్టలు తొలగించండి

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 13 : నగరంలోని బృందావనంలో సీసీ రోడ్డు నిర్మాణంలో ఉపయోగించిన ఇసుక, కంకర గుట్టల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని టీడీపీ నాయకుడు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ నగర కమిషనర్ వికాస్ మర్మత్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయినప్పటికీ ఇసుక, కంకర గుట్టలను తొలగించలేదని ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించలేదని ఆరోపించారు.

ఓటరు జాబితాలో తప్పిదాలకు తావులేదు

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 13 : నెల్లూరు నగర ఓటరు జాబితా తయారీలో తప్పిదాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సహాయ ఓటరు నమోదు అధికారి దేవీ కుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓటరు జాబితాలో అవకతవకలపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంపై సమగ్ర విచారణ జరిపామని తెలిపారు. 43వ డివిజన్‌లోని పీఎస్ నెం.67,68లో విచారణ జరపగా మృతులకు సంబంధించి ఫారం-7పై క్షేత్ర స్థాయిలో పరిశీలించి ధ్రువీకరణ పత్రాలతో సహా దరఖాస్తు చేసినట్లు తెలిపారు. వేద సంస్కృత పాఠశాలలోని పీఎస్ నెం. 95లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నట్లు తెలపగా అందులో ఒక ఓటు తొలగించేందుకు ఫారం 7ను 10వ తేదీనే దరఖాస్తు చేసినట్లు వివరించారు.

ఘనంగా కాత్యాయనీ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 13 : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం రాత్రి కాత్యాయనీ దేవి వ్రతం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామశర్మ, వేద పండితుడు రామకృష్ణ శర్మ భక్తులతో ఈ వ్రతం చేయించారు. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, సహాయ కమిషనర్ అర్వభూమి వెంకట శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అపోలోకు బెస్ట్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అవార్డు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 13 : నెల్లూరు అపోలో ఆసుపత్రికి బెస్ట్ మల్టీ స్పెషాలిటీ అవార్డు వచ్చిందని ఆ వైద్యశాల డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్ వెల్లడించారు. మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు అపోలో ఆసుపత్రికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. న్యూ ఇండియా అష్యూరెన్స్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ ఈ నెల 2వ తేదీన ముంబైలో అవార్డు ప్రదానం చేసిందన్నారు. త్వరలో ఆసుపత్రిలో కేన్సర్ విభాగాన్ని అన్ని హంగులతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అపోలో ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు మాట్లాడుతూ ఏపీలో ఏ ఆసుపత్రికి దక్కని అరుదైన అవార్డు నెల్లూరు అపోలోకు రావటం ఆనందంగా ఉందన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ముత్తుకూరు, ఫిబ్రవరి 13 : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పిడతాపోలూరులోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో శివసాత్విక్ 98.12, చరణ్ తేజ 96.55, లక్ష్మీ యశ్వంత్ 96.41 పర్సంటేజీలు సాధించారు. మరో 50 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎస్ఆర్ కళాశాల చైర్మన్ వరదరెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జీఎం రాజేంద్రప్రసాద్, డీజీఎం గోవర్ధన్‌రెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, డీన్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ అమరేందర్, జయప్రకాష్, సుబ్బారెడ్డి, కిరణ్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

వలంటీర్లకు హ్యాండిచ్చారు!

● ఇప్పటికీ అందని రేషన్ పంపిణీ ప్రోత్సాహక నగదు



తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: ఇంటికే రేషన్ సరఫరా పేరుతో వైసీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టింది. అయితే ఆపరేటర్లు వీధిలో ఒకటి రెండు చోట్ల మాత్రమే వాహనాన్ని ఆపి రేషన్ పంపిణీ చేస్తున్నారని, కార్డుదారుల వద్దకు వెళ్లి నేరుగా ఇవ్వడం లేదని గుర్తించాక రేషన్ పంపిణీలో వలంటీర్లను భాగస్వాములను చేస్తూ గత ఏడాది జీవో తీసుకువచ్చింది. జిల్లాలోని 34 మండలాలు, 7 మున్సిపాలిటీల్లో ఒక్కో వలంటీరు పనిచేసే ప్రాంతంలో సుమారు 5పాయింట్ల చొప్పున 55వేల పంపిణీ పాయింట్లను పౌరసరఫరాల శాఖ అధికారులు ఎంపికచేశారు.ఈ పాయింట్ల వద్ద ప్రతి నెలా ఎండీయూ వాహన ఆపరేటరు, స్థానిక వాలంటీరు పర్యవేక్షణలో కార్డుదారులకు బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమపిండి పంపిణీ చేయించాలని జిల్లా యంత్రాంగం ఆదేశించింది.ఇందుకోసం వలంటీర్లకు నెలకు ప్రోత్సాహకం కింద రూ.750 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.జిల్లాలోని 1,457 రేషన్ దుకాణాల ద్వారా వచ్చే బియ్యం, కందిపప్పు, చక్కెర పంపిణీ వలంటీర్ల ఆధ్వర్యంలో జనవరి నుంచి ప్రారంభమైంది. గత నెలలో పనిచేసిన వలంటీర్లకు ప్రోత్సాహకం కింద ఇంత వరకు రూపాయి కూడా చెల్లించక పోవడంతో నిరుత్సాహపడుతున్నారు.పౌరసరఫరాల శాఖ నుంచి జనవరి నెలకు విడుదల కావాల్సిన ప్రోత్సాహకం రూ.88.72లక్షల్లో ఇంతవరకూ చిల్లిగవ్వకూడా అందకపోవడంతో ఫిబ్రవరి నెలలో ఎండీయూ వాహనాల్లో రేషన్ సరుకుల పంపిణీ పర్యవేక్షణకు వలంటీర్లు ఆసక్తి చూపలేదు. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజారఘువీర్‌ను అడగ్గా ఇంకా నిధులు రానిమాట వాస్తవమేనన్నారు. డబ్బులు వచ్చిన వెంటనే చెల్లిస్తామని చెప్పారు.

ముక్కంటికి భారీ ఆదాయం



దక్షిణామూర్తి సన్నిధిలో హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 : శ్రీకాళహస్తీశ్వరాలయానికి రికార్డుస్థాయి ఆదాయం లభించింది.ఆలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధిలో జరిగిన లెక్కింపులో 1,85,80,188రూపాయలు హుండీ ద్వారా వచ్చింది. బంగారం 118 గ్రాములు, వెండి 572.350కేజీలు రాగా వివిధ దేశాలకు చెందిన 153 నోట్లు లభించాయి. 34 రోజుల తర్వాత జరిగిన లెక్కింపులో వచ్చిన ఈ ఆదాయం సరికొత్త రికార్డుగా అధికారులు ప్రకటించారు.

'శ్రీనివాసం' సబ్‌వే విస్తరణ

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 12: టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీనివాసం అతిథి గృహం నుంచి ఆర్టీసీ బస్టాండుకు నడిచి వెళ్లే భక్తుల కోసం 2011లో సబ్‌వేను నిర్మించిన విషయం తెలిసిందే. ఇది కొంతకాలం ఉపయోగకరంగా ఉన్నా రోడ్డు విస్తరణ జరగడంతో ఆరేళ్లుగా నిరుపయోగంగా మారింది. శ్రీనివాసం, మాధవం సముదాయంలో బసచేసే భక్తులు రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడుతున్నారు. పైగా శ్రీనివాస సేతు నుంచి ఓ మార్గం సరిగ్గా శ్రీనివాసం ప్రధాన గేటు వద్ద ముగియడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు అధ్యయనం చేశారు. వారి నివేదిక మేరకు రూ.2కోట్లతో సబ్‌వే విస్తరణ పనులు చేపట్టారు. సబ్‌వేను శ్రీనివాసం ప్రహరీ వరకు కొనసాగించి, అక్కడి నుంచి వెడల్పాటి సీసీ రోడ్డు నిర్మించనున్నారు. అత్యాధునికంగా తోరణం నిర్మించి.. వాహనాల రాకపోకలకు కూడా రెండు మార్గాలు ఏర్పాటు చేయనున్నారు. ఇవన్నీ పూర్తయితే ఇప్పటి వరకు ఉన్న శ్రీనివాసం ప్రధాన ద్వారాన్ని మార్గాన్ని శాశ్వతంగా మూసివేయనున్నారు.



ప్రారంభమైన పనులు



బసవయ్యపాలెం చెరువు ఆక్రమణకు చెక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీకాళహస్తి/తొట్టంబేడు, ఫిబ్రవరి 13:బసవయ్యపాలెం చెరువు కబ్జాకు తాత్కాలికంగా అడ్డుకట్ట పడింది. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని బసవయ్య పాలెం చెరువు పక్కన వేసిన వెంచర్‌కోసం చెరువులోనే బాట వేసేందుకు రియల్టర్లు తెగబడడంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రైవేట్ వెంచర్ కోసం చెరువులో బాట..! శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ లక్ష్మీశ సీరియస్‌గా స్పందించి తొట్టంబేడు రెవెన్యూ అధికారులను చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. దీంతో వీఆర్వో మురళి పోక్లైనర్‌తో ఘటనా స్థలానికి చేరుకుని చెరువు భూమిలో ఏర్పాటు చేసిన సిమెంట్ పైపులను పక్కకు తొలగించారు. అయితే ఆ సిమెంట్ పైపులను సమీపంలోనే ఉంచి వెళ్లడంతో వివాదం సద్దుమణిగిన తర్వాత మళ్లీ రోడ్డు వేసే అవకాశం కన్పిస్తోంది.ఉన్నతాధికారులు గట్టి చర్యలు తీసుకుంటే తప్ప రియల్టర్ల ఆగడాలు ఆగే అవకాశాల్లేవు.



చెరువులో బాటకోసం రియల్టర్లు వేసిన పైపుల తొలగింపు

జడ్పీ బడ్జెట్ రూ.374 కోట్లు

రూ.297 కోట్ల ఖర్చుతో రూపకల్పన ● సభ్యుల ఏకగ్రీవ ఆమోదం





సమావేశ మందిరంలో జడ్పీ ఖాళీగా ఉన్న కుర్చీలు - సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 13 : జిల్లా పరిషత్ 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను జడ్పీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. బడ్జెట్ అంచనాలకు సంబంధించి నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన మంగళవారం అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బడ్జెట్‌పై జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో చిరంజీవులు సభ్యులకు వివరించారు. 2022-23 ఏడాది ఆదాయం రూ.157.89 కోట్లు రాగా రూ.161.05 కోట్లు ఖర్చయినట్లు చూపారు. 2023-24 బడ్జెట్ అంచనాలు రూ.366.89 కోట్లు కాగా ఖర్చు రూ.326.37 కోట్లు అయ్యిందని చూపారు. 2023-24 సవరణ అంచనాలు రూ.348.20 కోట్లు కాగా ఖర్చు రూ.281.26 కోట్లు అయినట్లు చూపారు. 2024-25 బడ్జెట్ అంచనాలు రూ.374.43 కోట్లు అని, రూ.297.42 కోట్లు ఖర్చవుతుందని, రూ.77 కోట్లు మిగులు ఉంటుందని అంచనాలు రూపొందించగా దీనికి సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

● ఆ బిల్లులు ఇప్పించడమ్మా...!

'రాష్ట్ర ప్రభుత్వ ఐదేళ్ల పాలన త్వరలో ముగుస్తుంది. ఈ నెల లేదా వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుంది. ఇప్పటికైనా చేసిన పనులకు బకాయిలు ఇప్పించడమ్మా.. మా పరువు కాపాడండమ్మా!' అంటూ పలువురు జడ్పీటీసీ సభ్యులు చైర్‌పర్సన్‌కు మొరపెట్టుకున్నారు. సమావేశం అనంతరం మర్రిపాడు, కావలి జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, రాఘవులు మాట్లాడుతూ సచివాలయాలు, నాడు-నేడు పనులు తదితర భవనాల నిర్మాణాలకు కాంట్రాక్టర్లు ఎవరూ రాలేదనానరు. దీంతో కార్యకర్తలను బతిమలాడి ఎమ్మెల్యేలు, మీపై ఉన్న నమ్మకంతో పనులు చేయించి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు బిల్లులు మంజూరు చేయలేదని, దీంతో కార్యకర్తలు అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రేపో, మాపో ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్నందున ఇప్పటికైనా బిల్లులు ఇప్పించాలని కోరారు. నాడు-నేడు పనుల కింద దాదాపు రూ.7 కోట్ల బకాయిలు ఉన్నాయని, సచివాలయాలు, ఇతర భవనాలకు సంబంధించిన పనులు పూర్తయినా ఇంతవరకు ఎంబుక్‌లు సిద్ధం చేయలేదని, వాటన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. ఇసుక రవాణాకు సంబంధించి జరిమానాలు భారీగా విధిస్తున్నా జడ్పీకి రూపాయి కూడా మైనింగ్ శాఖ ఇవ్వడం లేదని, వాటిని రాబట్టాలని కోరారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి బిల్లులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నందున నిధులు అధికంగా కేటాయించాలని కోరారు.

● ఎంపీలు, ఎమ్మెల్యేలు డుమ్మా

ఈ బడ్జెట్ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు గైర్హాజరు అయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇద్దరు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బీద మస్తాన్‌రావు, ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, గురుమూర్తితోపాటు రాష్ట్ర మంత్రి సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వరప్రసాద్, సంజీవయ్య, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు గైర్హాజరయ్యారు. సార్వత్రిక హడావుడి మొదలుకావడంతో ప్రచారాలపై దృష్టి సారించిన నేతలు జడ్పీ సమావేశంపై ఆసక్తి చూపలేదు. జిల్లాలోనే మంత్రి కాకాణితోపాటు ఎక్కువమంది ఎమ్మెల్యేలు ఉన్నా ఈ సమావేశానికి డుమ్మాకొట్టడం చర్చనీయాంశమైంది.

ఆసరా సభలో మహిళల అవస్థలు



సరిపడా టెంట్లు వేయకపోవడంతో ఎండలోనే నిల్చున్న మహిళలు

వాకాడు, ఫిబ్రవరి 13: వాకాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం జగనన్న ఆసరా కార్యక్రమం జరిగింది. సభకు మహిళలను అధికంగా తీసుకురావాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్, సీసీలను ఆదేశించారు. దీంతో మహిళలపై ఒత్తిడి తెచ్చి సుమారు మూడు వేలకు పైగా వచ్చేలా చేశారు. అయితే సరిపడా టెంట్లు వేయకపోవడంతో 2వేల మందికి పైగా మహిళలు కూర్చోడానికి కుర్చీలు లేక ఎండలో రెండున్నర గంటల పాటు తీవ్ర అవస్థలు పడ్డారు. పలువురికి మధ్యాహ్నం ఆహారం కూడా దొరక్కపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బలవంతంగా సభకు తీసుకొచ్చిన తమకు భోజన వసతులు కూడా ఏర్పాటు చేయలేని ప్రభుత్వానికి మహిళా సాధికారిత గురించి మాట్లాడే హక్కులేదంటూ కొందరు విమర్శలు గుప్పించారు. కాగా, మండలంలో 621 గ్రూపులకు సంబంధించి 6,068 మంది మహిళలకు రూ.4.15 కోట్ల నమూనా చెక్కును ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, జడ్పీటీసీ రౌతు రామకృష్ణ, అజిత్‌కుమార్‌రెడ్డి, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి వలంటీర్లు విధేయులై ఉండాలి: మేరిగ



వలంటీర్ల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

వాకాడు, ఫిబ్రవరి 13: వలంటీర్లు వైసీపీ విధేయులే ఉండాలని గూడూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వలంటీర్ల పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీచేసే అభ్యర్థుల విజయానికి వలంటీర్లు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఓటర్లకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, జడ్పీటీసీ రౌతు రామకృష్ణ, దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి



సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు

చిల్లకూరు, ఫిబ్రవరి 13: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసికట్టుగా పనిచేస్తూ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, జనసేన నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో టీడీపీ, జనసేన నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి, ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలి నియంత పాలన సాగిస్తున్న జగన్‌కు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సుందరరామిరెడ్డి, తీగల చంద్రశేఖర్, కొట్టి వెంకటేశ్వర్లు, ఇంద్రవర్ధన్, నాగార్జున, రాజశేఖర్, సనత్‌కుమార్, అవినాష్, శంకర్, ఓకాంర్, విజయ్, సాయి, కృష్ణ, మురళీరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, వరదారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పోలయ్య, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల కడుపుకొట్టిన వైసీపీ: పాశం

గూడూరు, ఫిబ్రవరి 13: వైసీపీ ప్రభుత్వం చేతివృత్తిదారుల కడుపుకొట్టిందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం నాయీబ్రాహ్మణులు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయీబ్రాహ్మణలకు ఆదరణ పథకం ద్వారా చేయూతనిచ్చారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేతివృత్తిదారులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా పాలన సాగిస్తూ అభివృద్ధిని విస్మరించిందన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, ఈదర శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్, భాస్కర్, శివయ్య, గురునాథం, గోపాల్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఆనం మాయలో పడొద్దు: రాంకుమార్ రెడ్డి

డక్కిలి, ఫిబ్రవరి 13: వెంకటగిరి ప్రజలు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి మాయలో పడొద్దని వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తెలుగుగంగ అతిథి గృహంలో వైసీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరిని భ్రష్టు పట్టించిన వల్లే ముఖ్యమంత్రి ఆయన్ను పక్కన పెట్టి తనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పచెప్పారన్నారు. తాను ఈ ఏడాదిలో కోట్లాది రూపాయల అభివృద్ధి చేశానని, ఎమ్మెల్యేగా గెలిస్తే ఎంతో అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కు విలువపై అవగాహన

నాయుడుపేట, ఫిబ్రవరి 13: నాయుడుపేటలోని శ్రీవేమ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓటు హక్కు విలువపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రజాసత్తా సంస్థ వ్యవస్థాపకుడు పులగర శోభన్‌బాబు మాట్లాడుతూ మన పాలకులను మనమే నిర్ణయించుకునే హక్కును ఓటు ద్వారా రాజ్యాంగం కల్పించిందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల బరిలో అభ్యర్థులు నచ్చకుంటే నోటాకు ఓటు వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీవేమ విద్యాసంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్ రెడ్డి, డాక్టర్ సతీష్‌కుమార్, ఆర్ఐ షాజహాన్, బీఎల్‌వో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కూచివాడలో జగనన్న సురక్ష

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 13: మండలంలోని కూచివాడ గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 318 మందికి వైద్య పరీక్షలు చేశారు. 17 మందికి కంటి వెలుగు ద్వారా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్, డాక్టర్లు వికాష్, శంకరయ్య, తనూజ, పునర్వీ, కిరణ్మయి, వెంకటగోపాల్, మేరీసుకన్య, పంచాయతీ కార్యదర్శి రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పునబాకలో...

పెళ్లకూరు, ఫిబ్రవరి 13: మండలంలోని పునబాకలో గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, సర్పంచు చిత్ర, ఎంపీటీసీ కన్నలి కుమార్‌స్వామి, నాయకులు లింగంనాయుడు, అట్ల కృష్ణయ్య, మల్లిఖార్జునరెడి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ పోలీసులపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

వాకాడు, ఫిబ్రవరి 13: ఎస్‌ఈబీ పోలీసులపై దాడిచేసిన ఏడుగురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ కొండూరుపాళెం వద్ద ఈనెల 11వ తేదీన కోడిపందేలు ఆపమన్నందుకు ఎస్‌ఈబీ ఎస్ఐ మరో ఇద్దరు సిబ్బందిపై నిర్వాహకులు దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

చెంగాళమ్మకు వెండి గిన్నెల విరాళం



వెండి గిన్నెలను ఈవోకు అందజేస్తున్న మల్లికార్జున రావు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13: చెంగాళమ్మ పరమేశ్వరికి కావలికి చెందిన భక్తుడు మల్లికార్జున రావు మంగళవారం 520 గ్రాముల బరువున్న రెండు వెండి తీర్థం గిన్నెలను ఈవో వెంకటేశ్వర్లుకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యుడు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళంగిని కొల్లగొడుతున్నారు..!

- గుట్టలు గుట్టలుగా ఇసుక డంప్‌లు
- చోద్యం చూస్తున్న అధికారులు



ఇలుపూరు నుంచి కాళంగి నది వెళ్లే దారిలో ఇసుక డంప్‌లు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13: కాళంగి నది పరివాహక ప్రాంతంలో ఇసుక దందా కొనసాగుతోంది. అక్రమార్జనే పరమావధిగా నిబంధనలకు తూట్లు పొడుస్తూ ప్రకృతి వనరును కొల్లగొడుతున్నారు. రైతుల వరప్రసాదిని అయిన కాళంగి నది నుంచి నిత్యం ఇసుక తరలిపోతోంది. సూళ్లూరుపేట మండలంలోని ఇలుపూరు, మంగళంపాడు ప్రాంతాల వద్ద కాళంగి నదిలో ఇసుకను అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్నారు. ఈ గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇసుక గుట్టలు, గుట్టలుగా డంపింగ్ చేసుకొని ట్రాక్టర్ల ద్వారా రియల్ ఎస్టేట్ నిర్మాణాలకు, పలు కంపెనీలకు తరలించి జేబులు నింపుకొంటున్నారు. పట్టపగలే.. పోలీసు, రెవెన్యూ అధికారుల ఎదురుగానే అక్రమ రవాణా సాగుతున్నా పట్టించుకోవడంలేదు. తోంది. అధికారులు సైతం మకేం తెలియదన్నట్లుగా ఉంటున్నారు. గ్రామాలను ఆనుకొని కాళంగి నది ఉండడంతో వీరి అక్రమ రవాణాకు కలిసిచ్చింది. నిత్యం ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా పొలాల వద్దకు తరలించి డంపింగ్ చేసుకుంటున్నారు. సూళ్లూరుపేట పట్టణం, శివారు ఉన్న రియల్ ఎస్టేట్ భవంతులకు, భుజ్జినాయుడు కండ్రిగ సమీపంలో ఉన్న పలు కంపెనీలకు ఇసుకను ట్రిప్పుల లెక్కన తరలించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. సామాన్యుడికి చిన్న పనికోసం ఇసుక అవసరమైనా ప్రభుత్వం కేటాయించిన రీచ్‌ల ద్వారానే తరలించాలి. కానీ అధికార పార్టీ నాయకులు అండదండలు ఉంటే ఎక్కడ నుంచి ఇసుకను తరలించినా అడిగే నాథుడే కరువయ్యాడు. ఇలుపూరు, మంగళంపాడు గ్రామాల్లో రోడ్డు పక్కనే ఉన్న ఇళ్లు, ఖాళీ స్థలాల్లో గుట్టలు గుట్టలుగా ఉన్న ఇసుక డంప్‌లు అధికారులకు కనిపించడం లేదు. సచివాయాల ఎదురుగానే రయ్‌మంటూ ఇసుక ట్రాక్టర్లు పోతున్న సంబంధిత అధికారులకు కనిపించడంలేదు. ఇదంతా అధికార పార్టీ నేతల అండదండలతోనే జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.





కాళంగి నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ - డంప్ చేసిన ఇసుకను ట్రాక్టర్‌కు లోడు చేస్తున్న కూలీలు

పర్యాటక కేంద్రంగా ఇరకం దీవి: కలెక్టర్



ఇరకంకుప్పం గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీ శా

తడ, ఫిబ్రవరి 13: ఇరకందీవిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లక్ష్మీ శా తెలిపారు. మంగళవారం ఆయన దీవిలోని పోలింగ్ కేంద్రాలు, ఆరోగ్య సబ్ సెంటర్‌ను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో అవసరమైన వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇరకందీవిలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం సుమారు 80 ఎకరాలను గుర్తించామని, తగిన ప్రణాళికలతో ప్రైవేట్ భాగస్వాములు ముందుకు వస్తే భూములను కేటాయిస్తామని చెప్పారు. ఇరకంకుప్పం గ్రామస్తులు పూడికుప్పంలో నివాస స్థలాలు కేటాయించాలని కోరారని, వారి అభ్యర్థన మేరకు 15 రోజుల్లో ఆ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, సీఐ మధుబాబు, తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, వివిధశాఖల అధికారులు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13: ప్రభుత్వాస్పత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు అందుతాయని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీ శా అన్నారు. మంగళవారం ఆయన సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. రక్త నిధి కేంద్రం, రక్త పరీక్ష గదులను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నామని, పేదలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూంను, ఉన్నత పాఠశాలలో ఉన్న ఈవీఎం పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ రహీంరెడ్డి, డీటీలు, చైతన్య, పవన్‌కుమార్, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, వైద్యులు రమేష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

విధ్వంస పాలనకు చరమగీతం పాడాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న విధ్వంస పాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక సత్రపువీధిలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలకు పరిష్కారం కావాలంటే చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎంటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, భాస్కర్, అమరయ్య, చంద్రమౌళి, భారతి, లక్ష్మి, సుధ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అన్నీ అనర్థాలే: సీడీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో

నాయుడుపేట, ఫిబ్రవరి 13: బాల్య వివాహాలు చేసుకోవడం ద్వారా మానసికంగా, శారీరకంగా అన్ని విధాల అనర్థాలే జరుగుతాయని ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి అన్నారు. నాయుడుపేట ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలలోని మహిళా సంరక్షణ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా శివరాత్రి రోజున బాల్యవివాహాలు జరుగుతుంటాయని, ముందుగానే వాటిని గుర్తించి ఆయా కుటుంబాల వారికి అవగాహన కల్పించాలన్నారు. యువతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అసభ్యకర స్పర్శ ప్రవర్తనను పసిగట్టి తల్లిదండ్రులకు లేక ఉపాధ్యాయులకు తెలియజేసేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. మహిళలకు, చిన్నారులకు రక్షణగా ఉండేలా మహిళా సంరక్షణ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

టీడీపీని గెలిపించండి



మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 13: మొదటిసారిగా ఓటుహక్కు పొందినవారు అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించి టీడీపీని గెలిపించాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక ఆదిశంకర కళాశాల వద్ద టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ఓటుహక్కు ఉన్న ప్రతిఒక్కరూ టీడీపీ గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గుడ్లూరు రవిచంద్ర, వేముల సునీల్, సందీప్, వెంకటసాయి, ధనుష్, మోహన్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కోట, ఫిబ్రవరి 13: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని గూడూరు ప్రభుత్వాస్పత్రి దంత వైద్యురాలు లలిత అన్నారు. మండల పరిధిలోని వంజివాక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. పొగాకు, గుట్కాలు తాగడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నేత పరుశురామ్‌సాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో కలెక్టర్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని కలెక్టర్ లక్ష్మీ శా దర్శించుకొన్నారు. ఆయనకు ఈవో వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనాంతరం వేదపండితులు ఆశీర్వవచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కలెక్టర్‌ను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఉపాధి రికార్డుల పరిశీలన

కోట, ఫిబ్రవరి 13: మండలంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులను రిసోర్స్ పర్సన్లు మంగళవారం పరిశీలించారు. మండలంలోని 21 పంచాయతీల్లో 2022 -23 ఆర్థిక సంవత్సరంలో రూ.4 కోట్ల వ్యయంతో ఉపాధి పనులు జరిగాయి. ఇందుకు సంబంధించి రెండు మూడు రోజుల్లో గ్రామాల్లో సామాజిక తనిఖీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రిసోర్స్ పర్సన్లు కావమ్మ, బాలాజీ, విల్సన్ సతీష్, రాజునాయక్ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నారు.

టీడీపీ విజయం తథ్యం

చిట్టమూరు, ఫిబ్రవరి 13: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని ఆ పార్టీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మెట్టు గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులకు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. వారికి మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పుచ్చలపల్లి శ్రీనివాసులురెడ్డి, మారంరెడ్డి జనార్దన్ రెడ్డి, యువ నాయకులు, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, గుంపర్ల చిన్నారావు, కాపులూరు చెంచురామయ్య ఆచారి, శ్రావణ్, కల్లూరు మణి, మురళీధర్, ఉదయ్ పాల్గొన్నారు.

క్రీడా పోటీల పోస్టర్ల ఆవిష్కరణ

కోట, ఫిబ్రవరి 13: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ కళాశాలలో మంగళవారం వార్షిక క్రీడా పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 19నుంచి మార్చి 17వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 7, 8, 9 ఒంగోలులో టెబుల్ టెన్నిస్‌లో ట్రోఫీ సాధించిన వంశీకృష్ణ, చెందును షీల్డ్‌లు, ప్రశంశాపత్రాలతో అభినందించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

వెంకటగిరి, ఫిబ్రవరి 13: సమస్యల సాధన కోసం మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరు జాన్ మాట్లాడుతూ జనవరి నెలలో మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుండగా సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇంతవరకు పట్టించుకోలేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యల పరిష్కారం కోసం జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రాజేష్, బాలాజీ, నరేష్, వేణు, శ్రీను, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 13: వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రతతో వ్యవహరించాలని సీఐ సంగమేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో జరిగిన భద్రతా మాసవేత్సవాల్లో ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని సూచించారు. ఎంఎఫ్ ప్రభాకర్‌రావు, డీఎం రామృకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ మళ్లీ గెలిస్తే రాష్ట్రం రావణ కాష్టమే: కురుగొండ్ల

డక్కిలి, ఫిబ్రవరి 13: వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం రావణ కాష్టంగా మారుతుందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని శ్రీపురం గ్రామంలో టీడీపీ నేత అయ్యపరెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో నాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో దోపిడీ, దౌర్జన్యాలు పెరిగిపోయాయని, సామాన్యులను సైతం అధికార పార్టీ నేతలు ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. జగన్ పాదయాత్రపై యాత్ర - 2 సినిమా తీసిన డైరెక్టర్‌కు దక్షిణ ఊటీగా పేరుగాంచిన హర్సిలీ హిల్స్‌లో భూమి కట్టబెట్టడం సరికాదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేడం ఖాయమని కురుగొండ్ల స్పష్టం చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కోటేశ్వర రెడ్డి, చీర్ల అయ్యపరెడ్డి, గంటి రామూర్తి, పునుగోటి మోహన్, రాజయ్యా నాయుడు, కలపాటి వెంకటాద్రి, సన్నుబోయిన రమణయ్య పాల్గొన్నారు.

వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థినిలు

గూడూరు, ఫిబ్రవరి 13: వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఎంవీఐ సునీల్ అన్నారు. మంగళవారం రవాణశాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, నర్సింగ్ విద్యార్థినులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ డిపోలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ద్వారా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడడం నేరమన్నారు. రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, అతివేగంగా వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలకు లోనవుతున్నారన్నారు. డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీహరిబాబు, ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు పలువురి నివాళి



రామ్మోహనరావు మృతదేహంపై టీడీపీ జెండా కప్పుతున్న పార్టీ నేతలు

ఓజిలి, ఫిబ్రవరి 13: టీడీపీ సీనియర్ నాయకుడు కంకణాల రామ్మోహనరావు మృతదేహానికి పలువురు నేతలు నివాళులర్పించారు. సోమవారం విజయవాడలో అనారోగ్యంతో మృతి చెందిన రామ్మోహనరావు మృతదేహాన్ని మంగళవారం ఓజిలికి తీసుకొచ్చారు. టీడీపీ సీనియర్ నాయకుడు వల్లూరు సూర్యప్రకాశరావు చేతుల మీదుగా రామ్మోహనరావు మృతదేహంపై పార్టీ జెండాను కప్పించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరసా రత్నం, మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, నాయకులు వెంకటేశ్వర్లు నాయుడు, ధనుంజయరెడ్డి, గోపాలరెడ్డి, పాడి వెంకటసుబ్బయ్య, నిరంజన్, పురుషోత్తంరాజు, కార్తీక్‌రాజు, మల్లిఖార్జునరాజు, వైసీసీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, హరినాథరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే ఖాదర్‌బాషా, కాంగ్రెస్, బీజేపీ నాయకులు రామ్మోహన్‌రావు మృతదేహానికి నివాళులర్పించారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

గూడూరు, ఫిబ్రవరి 13: స్థానిక వాములమిట్ట ప్రాంతంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, బొమిడి శ్రీనివాసులు, గోపి, కృష్ణప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

బాలాయపల్లి, ఫిబ్రవరి 13: మండలంలోని జయంపు గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో పనిచేసే రవి అదే గ్రామానికి చెందిన సంపూర్ణమ్మ అనే మహిళ వద్ద రూ.8000 అప్పు తీసుకుని కొంత చెల్లించాడు. మిగిలిన మొత్తం ఇవ్వాలని అడిగినందుకు తనపై దాడి చేశాడని సంపూర్ణమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మెహబూబ్ సుభానీ తెలిపారు.

వీరమహిళలకు సత్కారం

వెంకటగిరి, ఫిబ్రవరి 14: సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని పట్టణంలోని జనసేన కార్యాలయంలో మంగళవారం వీరమహిళలను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు తోటా కృష్ణయ్య, అనీల్ రామారావు, చాముండీ రాధమ్మ, కోనా రవిశంకర్, ఆరవ రాజేశ్వర్, కొండాపురం కస్తూరి, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.